STUDY ABROAD
TOP GLOBAL DESTINATTIONS
Free IELTS coaching
GradsUniverse
+91 6301726400

ESTD: 1999
www.voodayam.com

# వుదయం

వరంగల్ | 02-05-2026 శనివారం | సంపుటి : 11 | సంచిక : 316s | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## బెంగాల్‌లో 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్



**కోల్‌కతా, మే 1 (వుదయం) :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన పోలింగ్‌కు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల నుంచి అందిన నివేదికల ఆధారంగా, పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ కేంద్రాల్లో తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. మే 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రీపోలింగ్ జరుగుతుంది. మిగతా 2లో..

# సమగ్ర కార్యాచరణతో రండి

### గుర్తింపు ఎన్నికలు, విలీనంపై సీఎం

- పీఆర్సీ అంశాన్ని పరిష్కరిస్తాం
- గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినళ్లు
- ఒక్క డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం
- ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి.
- ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం



**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :** ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు శుక్రవారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు.

ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని.. కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు,

రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచిన్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని.. నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి మిగతా 2లో..

# ఇంధన ధరల పెంపుకు అవకాశం

- ఇంధన ధరలను పెంచడం లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకటన
- ప్రపంచ స్థాయి ఒడిదుడుకుల నుండి దేశానికి రక్షణ కల్పిస్తామన్న మంత్రి హర్దీప్ సింగ్
- గత నాలుగేళ్లుగా పెరగని ధరలు





**న్యూఢిల్లీ, మే 1 (ఎఎంఎస్) :** నాలుగు కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందన్న ఊహాగానాల నడుమ, పెరుగుతున్న నష్టాలు, ప్రపంచ ఇంధన మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ధరలను పెంచవచ్చని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం తెలిపాయి.

హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఆంక్షలు కొనసాగడం, నిలిచిపోయిన శాంతి చర్చల మధ్య అమెరికా, ఇరాన్ నాయకుల మధ్య మాటల యుద్ధం పెరగడంతో, అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఈ వారం బ్యారెల్‌కు మిగతా 2లో..

### ఇజ్రాయెల్‌కు మరింత సైనిక సామాగ్రి

# ఇరాన్‌పై తిరిగి దాడులు?



- 24 గంటల వ్యవధిలోనే అమెరికా నుంచి 6500 టన్నుల సైనిక సామగ్రి
- అష్‌దోద్, హైఫా రేవుల్లో కార్గో నౌకలు

**వుదయం డెస్క్, మే1:** ఒకవైపు కాల్పుల విరమణ, శాంతి చర్చలు అంటూనే అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న వాగ్యుద్ధాలతో పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితి కొనసాగుతోంది. ఒకవైపు, తాను యుద్ధానికి అనుకూలం కానంటూనే, మిగతా 2లో..

### ఫోన్ ట్యాపింగ్ పై త్వరలోనే

# సిట్ రెండో ఛార్జ్‌షీట్

### డీజీపీ సీవీ ఆనంద్





**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ చివరి దశకు వచ్చిందని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. త్వరలోనే సిట్ రెండో ఛార్జ్‌షీట్‌ను కూడా దాఖలు చేయబోతోందని ప్రకటించారు. శుక్రవారం రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ మిగతా 2లో..

### వాణిజ్య సిలిండర్ల ధరల

# భారీ పెంపు

### ముందే చెప్పానన్న రాహుల్



**న్యూఢిల్లీ, మే1 (ఎఎంఎస్) :** వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలో వచ్చిన భారీ పెరుగుదలపై ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం స్పందించారు. వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచడంపై ఆయన విమర్శలు గుప్పించారు. వాణిజ్య సిలెండర్ ధర ఒక్కరోజులో రూ.993కి పెరిగిందని, ఒక్కరోజులో ఇంత భారీగా పెరగడం ఇదే తొలిసారని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌పై పోస్టు చేశారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 మేర పెరిగాయని ఆయన పేర్కొన్నారు; మూడు నెలల వ్యవధిలో ఇది 81శాతం పెరుగుదల అని ఆయన అభివర్ణించారు. ఎన్నికలానంతరం దేశీయ మిగతా 2లో..

### ప్రాణహిత-చేవెళ్ల

# పునరుద్ధరణకు చర్యలు

- తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి ప్రణాళికలు
- మహారాష్ట్రలో ముంపు తగ్గింపుకు ప్రత్యామ్నాయ మార్గాలు
- ఐఐటీ,హైదరాబాద్ ఆర్వీ అసోసియేట్స్ నిపుణులతో ప్రత్యామ్నాయ అలైన్ మెంట్ల పరిశీలన
- ఎన్.డి.ఎస్.ఏ మార్గదర్శనం మేరకు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ లకు మరమ్మతులు
- ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు



**హైదరాబాద్, మే 01 (వుదయం బ్యూరో):** ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిన చేవెళ్లప్రాణహిత వద్ద బ్యారేజ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకు తుమ్మిడిహట్టి వద్ద నిర్మించ తలబెట్టిన బ్యారేజ్ నిర్మాణనికి మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపేందుకు పూర్తి స్థాయిలో సాంకేతిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులను ఆదేశించారు.తుమ్మిడిహట్టి వద్ద నిర్మించ తలపెట్టిన బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్రతో సంప్రదింపులు జరపనున్న నేపథ్యంలో ఉభయరాష్ట్రలకు అనువైన పద్దతిలో ఉండేందుకు ప్రతిపాదనలు రూపొందించడంతో పాటు అంతర్ రాష్ట్ర జల ఒప్పందాలు అంశంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం బేగంపేట లోని తన క్యాంప్ మిగతా 2లో..

### రైతు సమస్యలపై

# బీజేపీ పోరు

- అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందే
- తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటామన్న హామీ సమాధి చేశారా?
- వడ్లకు బోనస్ హామీ అంతా ఉత్తిదేనా?
- పత్తి పంటకు కనీస మద్దతు ధర ఎగ్గొట్టి ముంచారు
- సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని రైతులను వెంటనే ఆదుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే ఆందోళన మిగతా 2లో..

### సమస్యల పరిష్కారానికి


# ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఉద్యోగ సంఘాలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ




**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. శుక్రవారం సాయంత్రం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల విన్నపాలను సావధానంగా విన్న ఆయన, వారి సమస్యలపై సానుకూల హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధి మిగతా 2లో..

# పవన్ ఖేరాకు ముందస్తు బెయిల్ మంజూరు



విచారణకు సహకరించాలని పవన్‌ఖేరాను 2 లో..

# ఏసీబీ డైరెక్టర్‌గా అవినాష్ మహంతి బాధ్యతలు స్వీకరణ



**హైదరాబాద్, మే 01 (వుదయం బ్యూరో) :** రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి

# పసుపును ఆహార పంటగా గుర్తించండి

క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించండి :

2 లో..



# సందర్భానుసారంగా మాట్లాడటం నేర్చుకో

కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ అద్దంకి సూచన



**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :** మేడే రోజు కేటీఆర్ బుద్దిలేని

# బెంగాల్‌లో 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్

మొదటి పేజీ తరువాయి..

డైమండ్ హార్బర్, మగ్రాహట్ పశ్చిమల లో తిరిగి పోలింగ్ కమిషన్ ఆదేశాల ప్రకారం, 142మగ్రాహట్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాలలోనూ, 143డైమండ్ హార్బర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాలలోనూ తిరిగి పోలింగ్ నిర్వహించనున్నారు. గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ రద్దుఏప్రిల్ 29న గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో జరిగిన పోలింగ్‌ను రద్దు చేసినట్లు ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.పశ్చిమ బెంగాల్ శాసనసభ సాధారణ ఎన్నికలు2026 నిమిత్తం, 2026ఏప్రిల్ 29న జరిగిన పోలింగ్‌కు సంబంధించి, 142మగ్రాహట్ పశ్చిమ్, 143డైమండ్ హార్బర్ శాసనసభ నియోజకవర్గాల సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల నుంచి అందిన నివేదికల ఆధారంగా, అలాగే అన్ని కీలక పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న అనంతరం,ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 58 ఉపసెక్షన్ (2) ప్రకారం, ఏప్రిల్ 29న, ఈ క్రింది పోలింగ్ కేంద్రాలలో జరిగిన పోలింగ్‌ను 'చెల్లనిదిగా' ప్రకటిస్తున్నట్లు తెలియజేయమని ఆదేశాలు అందినట్లు ఆ ఉత్తర్వు పేర్కొంది. ఇవి మార్గదర్శకాల ప్రకారం తాజా పోలింగ్ నిర్వహణ/రిటర్నింగ్ అధికారుల హ్యాండ్‌బుక్2023'లోని 13వ అధ్యాయం, పేరా 13.62లో పొందుపరిచిన సూచనలకు అనుగుణంగా ఈ రీపోలింగ్ నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపింది.

# ప్రాణహిత–చేవెళ్ల పునరుద్ధరణకు చర్యలు

మొదటి పేజీ తరువాయి..

కార్యాలయంలో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రలోని భూభాగంతో పాటు చప్రాల వన్యప్రాణుల అభయారణ్యంలో ముంపు ప్రభావం తగ్గేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలకు అవసరమైతే నష్ట పరిహారాన్ని చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో 148 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మాణానికి అంగీకరించిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ తక్కువ వ్యయంతో వరద నీటి ప్రవాహాన్ని వినియోగించేలా నిర్మాణం చేపట్టేలా మార్గాలు చేపట్టాలని ఆయన సూచించారు.సాంకేతిక నైపుణ్యం, ఆర్థిక ప్రయోజనాలతో పాటు సమగ్రంగా అధ్యయనం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి గాను అంతర్ రాష్ట్ర చర్చలకు ముందే ప్రత్యామ్నాయ మార్గాలు, సాధ్యాసాధ్యాలు, ఖర్చు చేసే మొత్తంతో ఒనగురే ప్రయోజనాలతో పాటు భూగర్భానికి సంబంధించిన సాంకేతిక వివరాలతో పూర్తిస్థాయిలో నివేదిక రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రూపుదిద్దుకున్న చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టును గోదావరి ఉపనది ప్రాణహితనదిపై తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి వరద కాలువలతో సాగునీరు సరఫరా చేయడంతో పాటు అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలు నిర్మించి ఎగువ ప్రాంతాలకు మళ్లించేలా ప్రణాళికలు రూపొందించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దీంతో ఉత్తర తెలంగాణా జిల్లాలతో పాటు ఎల్లంపల్లి జలాశయాలతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాంతాల వరకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు.తక్కువ వ్యయంతో ఉత్తర తెలంగాణా జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న సంకల్పంతో ఈ ప్రాజెక్టు రూపు దిద్దుకుందన్నారు.అయితే 2014 లో అధికారంలోకి వచ్చిన బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ ల పేరుతో అకారణంగా కాళేశ్వరం పేరుతో మెడిగడ్డ, అన్నారం ,సుందిళ్ల బ్యారేజ్ లు నిర్మించినా ఆశించిన ప్రయోజనం చేకూరలేదన్నారు.ప్రాజెక్టు పరిధి విస్తరించి నప్పటికీ ఎత్తిపోతలపై ఆధారపడడంతో విద్యుత్ చార్జీలు పెనుభారంగా పరిణమించిడం తో పాటు భారీ వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు బయట పడడంతో వరద కాలువల ద్వారా లభించే ప్రయోజనాలు నెరవేరక పోగా రంగారెడ్డి జిల్లా చివరి ప్రాంతాలకు ఎంత మాత్రం ప్రయోజనం చేకూరలేదన్నారు. చేవెళ్ల ప్రాణహిత పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నం అయ్యే ప్రసక్తి లేదన్నారు. అప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ 11వేలకోట్లు ఖర్చు పెట్టి 71.5 కిలో మీటర్లు దూరం కాలువ తవ్వకాలు హెడ్ వర్క్ నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను సాధ్యమైన మేర వినియోగించుకుంటు తక్కువ వ్యయంతో ఎల్లంపల్లి నుండి వరద కాలువ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు దృష్టి కేంద్రీకరించామన్నారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి, అక్కడి నుంచి సుందిళ్ల వరకు అనుసంధానానికి నాలుగు ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ ప్రతిపాదనలను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , హైదరాబాద్, ఆర్వీ అసోసియేట్స్‌తో కలిసి పరిశీలిస్తున్నారని అన్నారు. భూసేకరణ తగ్గించడం, పంపింగ్ అవసరాన్ని తగ్గించడం, టన్నెల్లు, కాలువల పొడవు తగ్గించడం, మొత్తం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను మెరుగుపరచడం ఈ అధ్యయనాల ప్రధాన లక్ష్యంగా ఉందని ఆయన తెలిపారు. అందుకు గాను తుమ్మిడిహట్టి ప్రాంతంలో భౌగోళిక, భౌగోళిక సర్వేలు కూడా వేగంగా కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు వర్షాకాలానికి ముందే అత్యవసర మరమ్మతులు పూర్తి చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన వివరించారు.ఈ పనులు ఎన్డీఎస్ఏ సాంకేతిక మార్గదర్శకత్వంలో కొనసాగనున్నాయని ఆయన తెలిపారు. ఈ మరమ్మతుల కోసం ప్రతి 1.5 మీటర్లకు ఒకసారి స్టాండర్డ్ పెనెట్రేషన్ టెస్ట్, ప్రతి 3 మీటర్లకు ఒకసారి పర్మియబిలిటీ పరీక్షలు నిర్వహించాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాతి పొర తగిలిన తర్వాత కూడా మరింత లోతుగా డ్రిల్లింగ్ చేయాలని సూచించారు. ఇందుకోసం సమన్వయ కమిటీ వెంటనే ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి, పనులకు స్పష్టమైన కాల పట్టిక రూపొందించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, భారీ ఎత్తిపోతల ఆధారిత విధానంతో పోలిస్తే తక్కువ నిర్వహణ వ్యయంతో విశ్వసనీయంగా సాగునీరు అందించే అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ పై త్వరలోనే సిట్ రెండో ఛార్జ్‌షీట్

మొదటి పేజీ తరువాయి..

మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచిన సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పోలీసింగ్‌ను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు.

విప్లవాత్మక మార్పులతో ఇప్పటికే తాము అగ్రస్థానంలో ఉన్నామని, పోలీసింగ్ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను తీసుకువస్తామని వెల్లడించారు. ముఖ్యంగా ఉమెన్ సేఫ్టీ, చైల్డ్, హ్యూమన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ దందాపై ప్రత్యేక ఫోకస్ పెడతామని ఆయన అన్నారు. పెరుగుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత వేగంగా వినియోగించి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను సరిగా ఉపయోగించుకుంటామని తెలిపారు. సైబర్ నేరగాళ్లు వ్యవస్థలను హ్యాక్ చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారని చెప్పారు. ఆ నేరాలను కంట్రోల్ చేసేందుకు జిల్లాల వారీగా ఎస్పీలు కూడా కార్యాచరణలో భాగస్వాములు కావాలని డీజీపీ ఆదేశించారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్, మే 1 (వుదయం ప్రతినిధి) :**

అర్హులైన జర్నలిస్టులందరికీ హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లోని అన్నీ హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖలతో చర్చలు జరిపి త్వరలో స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు తమ సమస్యలు, అభ్యర్థనలు మంత్రికి వివరించారు. వాటిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టుల అందరూ ఓకే మాట మీదకు రావడం శుభపరిణామ అన్నారు. అన్నీ అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి తో పాటు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్‌కు మరింత సైనిక సామాగ్రి

# ఇరాన్‌పై తిరిగి దాడులు?

మొదటి పేజీ తరువాయి..

ఇజ్రాయెల్‌కు భారీగా సైనిక సామాగ్రిని అమెరికా చేరవేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సామాగ్రితో లెబనాన్‌పై దాడి చేస్తారా లేక ఇరాన్‌పైనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

దాదాపు 24 గంటల వ్యవధిలోనే అమెరికా నుంచి 6500 టన్నుల సైనిక సామగ్రి అందినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ సామాగ్రిని కార్గో నౌకల్లో, విమానాల్లో పంపినట్లు ఆ శాఖ వెల్లడించింది. నౌకలు అయితే,

అష్‌దోద్, హైఫా రేవుల్లో ఉన్నాయని, వీటిలో భూతల, గగనతల దాడులకు వినియోగించే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, సైనిక ట్రక్కులు వంటివి అనేకం ఉన్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ పై చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 1,15,600 టన్నుల సైనిక సామగ్రిని అమెరికా పంపించినట్లు ఇజ్రాయెల్ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఏ క్షణమైనా శత్రువులను ఎదుర్కొనేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ పేర్కొనడం గమనార్హం.మరోవైపు, ఇరాన్‌పై సైనిక చర్యకు సంబంధించిన అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని ఇప్పటికే అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు వివరించినట్లు సమాచారం. ఇరాన్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా స్వల్ప వ్యవధిలో అత్యంత శక్తిమంతమైన దాడులు చేయాలని ఈ ప్రణాళికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ తరహా దాడులతో తెహ్రాన్ చర్చలకు రాక తప్పని పరిస్థితి ఉంటుందని అమెరికా భావిస్తోంది.

w ఇక, హొర్ముజ్ జలసంధిలో కొంత భాగాన్ని తమ నియంత్రణలోకి తీసుకునే అంశాన్ని కూడా అగ్రరాజ్య సెంట్రల్ కమాండ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాలను పూర్తిగా వదిలేయాలని ట్రంప్ ముందునుంచీ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెహ్రాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని అగ్రరాజ్యం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టే అంశాన్ని కూడా అమెరికా యోచిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌పై మళ్లీ భీకర స్థాయిలో దాడులు జరుగుతాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# మానవ హక్కుల షార్ట్ ఫిల్మ్ పోటీకి ఎన్‌హెచ్ఆర్సీ ఆహ్వానం

**జూన్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ**

**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :**

జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్ హెచ్ ఆర్సీ) ఆధ్వర్యంలో మానవ హక్కులపై 12వ ఎడిషన్ ఇండియా షార్ట్ ఫిల్మ్ పోటీ 2026 నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ (మీడియా, కమ్యూనికేషన్) జైమిని కుమార్ శ్రీవాస్తవ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలో పాల్గొనే చిత్రాలు హిందీ, ఆంగ్లం లేదా ఇతర భారతీయ భాషల్లో ఉండవచ్చని, అయితే ఆంగ్ల సబ్‌టైటిల్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. షార్ట్ ఫిల్మ్ వ్యవధి 3 నుంచి 10 నిమిషాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఉత్తమ చిత్రాలకు నగదు బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు. మొదటి, రెండో, మూడో బహుమతులకు వరుసగా రూ.2 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.1 లక్షలు ఇవ్వబడతాయని, అదనంగా జ్యూరీ సిఫారసు మేరకు గరిష్టంగా నాలుగు సర్టిఫికెట్లు, ఒక్కొక్కటికి రూ.50 వేలు చొప్పున ప్రదానం చేయబడతాయని వివరించారు. వయస్సుతో సంబంధం లేకుండా వివిధ ప్రాంతాల పౌరుల నుంచి ఆన్‌లైన్ ద్వారా ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ చిత్రాలను nhrcshortfilm@gmail.com కు జూన్ 30, 2026 లోపు పంపించాలని సూచించారు. మానవ హక్కులపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ పౌర

కేంద్రీకృత కార్యక్రమంలోవిశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని పేర్కొన్నారు.

# పసుపును ఆహార పంటగా గుర్తించండి

**హైదరాబాద్, మే 01 (వుదయం ప్రతినిధి) :**

పసుపును ఆహార పంటగా గుర్తించి క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. నిజామాబాద్ కు చేరువగా మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్ లో క్వింటాల్ పసుపునకు రూ.17 వేల ధర పలుకుతుందని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ లో వ్యాపారులు సిండికేట్ గా మారి రూ.13 వేలకు మించి ధర పెట్టడం లేదని, దీంతో పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం మీడియాకు ఆమె ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పైసెస్ బోర్డు ఉత్సవ విగ్రహంలా మారిందని.. స్పైసెస్ బోర్డును బలోపేతం చేసి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లోని పసుపు రైతులకు అండగా నిలవాలని కోరారు. వెంటనే ఆహార పంటల జాబితాలో పసుపును చేర్చి కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. నిజామాబాద్ మార్కెట్ లో ఇంకా లక్ష క్వింటాళ్లకు పైగా పత్తి కొనుగోలు చేయాల్సి ఉందని, ఆ రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. ఇ - నామ్ 2.0 ప్రారంభ సమయంలో నిజామాబాద్ మార్కెట్ ను చేర్చకపోవడంతో పసుపు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. తర్వాత ఇ - నామ్ 2.0లో నిజామాబాద్ మార్కెట్ ను చేర్చినా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతోనే గడిచిన ఏడేళ్లుగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో పసుపు పంట సాగు విస్తీర్ణ గణనీయంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపు రైతులను ఆదుకునే చర్యలు wచేపట్టాలని కోరారు.

# పవన్ ఖేరాకు ముందస్తు బెయిల్ మంజూరు

**న్యూఢిల్లీ, మే 1 (వుదయం):**

కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు భారీ ఊరట లభించింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సతీమణి రినికి భూయాన్ శర్మపై ఆయన చేసిన ఆరోపణల కేసులో సుప్రీం కోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో ఖేరాకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది.సుప్రీం కోర్టు నిన్నటి ఉత్తర్వులను ఈరోజు వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేసింది.అస్సాం సీఎం సతీమణి రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ ఖేరా చేసిన ఆరోపణలపై ఆమె ఫిర్యాదు మేరకు గువాహటిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా చేసిన అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు.ఖేరా, అస్సాం ప్రభుత్వం నుండి వివరణాత్మక వాదనలు విన్న తర్వాత గురువారం తీర్పును రిజర్వ్ చేసిన జస్టిస్ జె.కె. మహేశ్వరి, ఎ.ఎస్. చందుర్కర్‌లతో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.ఈ సందర్భంగా విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరు కావాలని పవన్‌ఖేరాను న్యాయస్థానం ఆదేశించింది. సాక్ష్యాలు తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని పేర్కొంది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టం చేసింది. ఇక, విచారణ సమయంలో అవసరమని భావిస్తే, అదనపు షరతులు విధించే స్వేచ్ఛ ట్రయల్ కోర్టుకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. పైన పేర్కొన్న పత్రాలు, సామాగ్రి ప్రస్తావన, కేవలం ముందస్తు బెయిల్ మంజూరు అంశాన్ని పరిశీలించే ఉద్దేశంతో మాత్రమేనని, దీనికి ఆ నేర విచారణ కేసు యొక్క గుణదోషాలతో ఎటువంటి సంబంధం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. కనుక, సంబంధిత న్యాయస్థానం ఈ వ్యాఖ్యల ప్రభావానికి లోనుకాకుండా, చట్టానికి అనుగుణంగా ఈ వ్యవహారంలో తదుపరి చర్యలు చేపట్టాలని పేర్కొంది.

# రైతు సంక్షేమంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి

**రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు, కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్,**

**నాగర్ కర్నూల్ మే 01 (వుదయం ప్రతినిధి)**




శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారం, జనగణ, రెడ్ క్రాస్ సభ్యత్వం తదితర అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్ లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి. సి ఎస్ రామ కృష్ణా రావు, నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అదనపు కలెక్టర్ దేవసాయం, సంబంధిత శాఖల అధికారులతో కలిసి లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ హాజరయ్యారు.రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో వాతావరణ మార్పులకు అనుగుణంగా జిల్లాలో కొనుగోలు ప్రక్రియలు చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ప్రతి రైతు నుండి ధాన్యం, మొక్కజొన్నను నిర్బంధంగా కొనుగోలు చేయాలని, ఎక్కడా ఆలస్యం జరగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన బరువు కొలత పరికరాలు, గోదాములు, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎటువంటి అవకతవకలు, మధ్యవర్తుల జోక్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు నిర్ణీత కాలంలోనే వారి ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని మంత్రులు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ,--------- .రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల కార్యచరణ ప్రణాళికను అమలు చేయడానికి జిల్లా స్థాయిలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, వ్యవసాయం, రెవిన్యూ, విద్యుత్ మరియు ఇరిగేషన్ విభాగాల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి జిల్లా యంత్రాంగం సాధించిందన్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా నిర్వహించేందుకు మే 2వ తేదీన నిర్వహించే నియోజకవర్గాల సభలను సమర్థవంతంగా విజయవంతంగా నిర్వహించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మొక్కజొన్న వరి కొనుగోళ్లపై ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలు వచ్చిన రైతుల నుండి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో స్వీయ గణనపై జిల్లా ప్రజలకు ఇదివరకే అవగాహన కల్పించేలా మీడియా సమావేశాన్ని నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ స్వీయ గణన చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ వివరించారు

రైతు వారం, కార్యక్రమం ద్వారా రైతు వారం సంబంధించిన రోజువారి కార్యక్రమాలను జిల్లాలోని రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయం ఆధునిక తో పాటు నేల సాంద్రత, పంటల మార్పిడి రైతుల వ్యవసాయ సాగు దిగుబడి పెంచే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఇదివరకే సమన్వయం చేయడం జరిగిందని తెలిపారుఇరిగేషన్ విభాగం కాలువల శుభ్రపరిచే పనులు, మరమ్మత్తులు చేపట్టి సాగునీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. నీటి పంపిణీ సమానంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు.

ఈ 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రతి విభాగం పురోగతిని తరచూ సమీక్షించేందుకు, ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రగతి నివేదికలు సేకరించి, అవసరమైన మార్పులు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించేలా జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు

## రాయపోల్ లో మే డే వేడుకలు

# ఘనంగా నిర్వహణ



*** కార్మికుల ఐక్యతే శక్తి – సీపీఎం మండల అధ్యక్షులు పొట్టేల స్వామి**

**దౌల్తాబాద్, మే 01 (వుదయం):**

ప్రపంచ కార్మికులారా ఐక్యతతో ఏకమై పోరాటాల దారిలో ముందుకు సాగితేనే హక్కులు సాధించగలమని సీపీఎం పార్టీ మండల అధ్యక్షులు పొట్టేల స్వామి అన్నారు. మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలు రాయపోల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జెండావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించి కార్మికుల ఐక్యత, హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం పొట్టేల స్వామి మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.వ్యవసాయ, పరిశ్రమ, నిర్మాణ రంగ కార్మికులు అందరూ ఐక్యంగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అనే నినాదంతో కార్మికుల ఐక్యతే వారి ప్రధాన శక్తి అని స్పష్టం చేశారు. కార్మికుల కృషితోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ బిల్లులను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడే విధంగా చట్టాలను అమలు చేయాలని, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసంపల్లి రాజు, కార్మికులు ఉడిది నాగరాజు, స్వామి, నవీన్, అర్జున్,రాజు, బాలరాజు, నర్సింలు, .ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసంపల్లి రాజు, కార్మికులు ఉడిది నాగరాజు, స్వామి, నవీన్, అర్జున్,రాజు, బాలరాజు, లక్ష్మి, నందు, చంద్రం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. లేబర్ కోడ్ బిల్లులను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడే విధంగా చట్టాలను అమలు చేయాలని, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసంపల్లి రాజు, కార్మికులు ఉడిది నాగరాజు, స్వామి, నవీన్, అర్జున్,రాజు, బాలరాజు, నర్సింలు, లక్ష్మి, నందు, చంద్రం, నాగరాజు

తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ శ్రామిక ప్రజా పోరాటమే మే డే

*** వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప**

**యాలాల మే 1 వు దయం( ప్రతినిధి ):-**

అంతర్జాతీయ శ్రామిక ప్రజా మేడేగా గుర్తింపు లభించిందని వికారాబాద్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు యూ.బుగ్గప్ప పేర్కొన్నారు. శుక్రవారం మే డే సందర్భంగా యాలాల మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బుగ్గప్ప మాట్లాడుతూ ప్రపంచ శ్రామిక ప్రజల చిందించిన నెత్తుటి త్యాగాలు గుర్తుగా అరుణ పతాక రెపరెపలతో ప్రపంచవ్యాప్తంగా సభలు ప్రదర్శనలతో మేడేను ఘనంగా నిర్వహించినమన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య మాట్లాడుతూ ప్రపంచ శ్రామిక ప్రజలు శ్రమయే మే డే అని అన్నారు. సకల దేశాల జాతుల మతాల కులాల కార్మికులత ఒకటేనని ఈ ప్రపంచమే మనది అని చెప్పిన కార్మిక ప్రజా అంతర్జాతీయ దినోత్సవమే మే డే గా గుర్తింపు లభించింది అన్నారు. ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక సమస్యల పరిష్కారానికి మూలకారమై మూల కారణంగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రజా పోరాట నిర్మాణానికి కార్మిక ప్రజల సిద్ధం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు 140 ఏళ్ల క్రితం



పోరాడి సాధించుకున్న చట్టాలను నేడు గంటలను పెంచే విధంగా కార్మికులను మరింత వెట్టిచాకి చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఫోర్ లేబర్స్ కోడ్ తీసుకురావడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాపాడి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాటి చికాగో పోరాట స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని మేడే చరిత్రక పిలుపు నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆరిఫ్, శివకుమార్, ఆనందం, చంద్రయ్య, అక్బర్, శ్రీనివాస్, సరస్వతి, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని

# వేగవంతం చేసి పురోగతి సాధించాలి



**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**


**గద్వాల మే 01 (వుదయం ప్రతినిధి)**

ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.


శుక్రవారం ఐడీఓసి సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణపు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మంజూరైన ఇళ్లు,గ్రౌండింగ్, పనుల పురోగతి, నిర్మాణ దశలు, ఇంకా ప్రారంభం కాని ఇళ్లపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలో ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళవారం, గురువారం ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి లబ్ధిదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకురాని వారి మంజూరీలను రద్దు చేసిన చోట, వారి స్థానంలో అర్హులైన కొత్త వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీలను సంప్రదించి ఆసక్తి కలిగిన అర్హులను గుర్తించాలన్నారు. మార్క్ అవుట్ నుంచి బేస్‌మెంట్, స్లాబ్ దశల ద్వారా ఇల్లు పూర్తయ్యే వరకు ప్రతి దశను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తూ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరును ఎంపీడీఓలు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సూచించారు. ఐహెచ్ఎల్ టాయిలెట్లకు సాంక్షన్ ఆర్డర్లు వెంటనే జారీ చేసి, ఇల్లు పూర్తయ్యే సమయానికి టాయిలెట్ నిర్మాణం కూడా పూర్తయ్యేలా అధికారులు లబ్ధిదారులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లింపులు జరగాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఓ ముసాయిదా బేగం,ఆయా మండలాల ఎంపీడీఓలు, హౌసింగ్ డి.ఈలు, ఏ.ఈ లు తదితరులు



# గ్రేటర్ హైదరాబాద్



## కార్మికుల కన్నీటి గాథే మానవ నాగరికత చరిత్ర!




షాద్ నగర్ మే 1(వుదయం)

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కన్నీటి చుక్కలే నాగరికత చరిత్రకు సిరా అని అభివర్ణించారు. కార్మికులే నూతన చరిత్ర రచయితలు అని పేర్కొన్నారు. శ్రమజీవుల కన్నీళ్లే అభివృద్ధి చరిత్రకు ఆధారమని తెలిపారు. కార్మికుల త్యాగమే సమాజ ప్రగతికి పునాది అని చెప్పుకొచ్చారు. శ్రమజీవుల శ్రమే నాగరికత నిర్మాణానికి మూలమని, కార్మికుల జీవితమే అభివృద్ధి చరిత్రకు సాక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు. బుద్ధ పూర్ణిమ శుభాకాంక్షలు పవిత్రమైన 'బుద్ధ పూర్ణిమ' సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, దయ, సహనం, శాంతి మార్గాలను మానవాళికి అందించిన అమూల్యమైన బోధనలు నేటి సమాజానికి మార్గదర్శనం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పవిత్రమైన రోజున మన మందరం సమైక్య జీవనం, శాంతి మార్గం ఎంచుకుని ముందుకు నడవాలని ఎమ్మెల్యే శంకర్ ఆకాంక్షించారు..

## సామాన్యులకు ఎల్ఓసీ గొప్ప వరం.....ఎమ్మెల్సీ అంజిరెడ్డి
## ముగ్గురికి రూ.7.20 లక్షల చెక్కుల పంపిణీ...



రామచంద్రపురం,మే 1(వుదయం) ఆసుపత్రి ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న పేదలకు ఎల్ఓసీ ఒక గొప్ప వరమని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు మొత్తం రూ.7.20 లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవసర సమయాల్లో వైద్య ఖర్చుల కోసం ఎల్ఓసీ పథకం పేదలకు సంజీవనిలా మారిందన్నారు. ఆసుపత్రి ఖర్చులు భరించలేక అప్పుల పాలవుతున్న కుటుంబాలకు ఇది పెద్ద భరోసా కల్పిస్తోందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఎమ్మెల్సీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతన కోఆప్షన్ సభ్యుడికి అభినందనలు...జిన్నారం మున్సిపాలిటీ నూతన కోఆప్షన్ సభ్యుడు నర్సింగరావు ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.మున్సిపాలిటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి పాలకమండలితో కలిసి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుండాలని పేర్కొన్నారు.



మన ప్రియతమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి స్వగ్రామం లోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మామిడిపల్లి BRS పార్టీ సీనియర్ నాయకులు మరియు మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి గారు ఫరూక్ నగర్ మండల BRS పార్టీ అధ్యక్షుడు.

లక్ష్మణ్ అన్న నందిగామ మండలం BRS పార్టీ వైస్ ప్రెసిడెంట్ పాకనాటి శ్రీపతి రెడ్డి (శ్రీపాల్), శరత్ కృష్ణ, రాజు గౌడ్, ఆదిత్య రెడ్డి తదితరులు

## పీసీసీ అధ్యక్షుడి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన శ్రీజ్యోతి భీమ్ భరత్

శంకర్‌పల్లి, మే 01 (వుదయం)




ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సమావేశం శంకర్‌పల్లిలో ఉత్సాహంగా జరిగింది. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాల అమలు వంటి అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జిల్లా కార్మిక విభాగం గౌరవ అధ్యక్షురాలు శ్రీ జ్యోతి భీమ్ భరత్ చేసిన సేవలకు గాను ప్రత్యేక గుర్తింపునిస్తూ అవార్డు ప్రదానం చేశారు. కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, మహిళా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడం, యాజమాన్యాలు -కార్మికుల మధ్య ఏర్పడే సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించడం వంటి సేవలకు గాను ఆమెను ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.
పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మరియు తెలంగాణ ప్రభుత్వ గౌరవ సలహాదారు వి. హనుమంతరావు చేతుల మీదుగా శ్రీజ్యోతి భీమ్ భరత్‌కు ఈ అవార్డు అందజేశారు. మహిళా కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో సేవలందిస్తున్న శ్రీజ్యోతి భీమ్ భరత్‌ను ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రశంసిస్తూ, ఆమె కృషి రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, కార్మిక వర్గం అభివృద్ధే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని నాయకులు స్పష్టం చేశారు .ఈ సందర్భంగా శ్రీజ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ, తనకు ఈ గౌరవాన్ని అందించినందుకు రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు ఆర్. ప్రకాష్ గౌడ్, ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి సహా పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కార్మిక సమస్యలతో పాటు మహిళా సమస్యలపై మరింతగా అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వానికి మరియు కార్మికులకు మధ్య వారధిగా పనిచేస్తానని ఆమె తెలిపారు.
మహిళా కార్మికులకు సముచిత న్యాయం కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
**ఎక్లాస్ ఖాన్‌పేటలో ఆధ్యాత్మికోత్సాహం**
**వైభవంగా కొనసాగుతున్న నవమ బ్రహ్మోత్సవాలు**
**వేద మంత్రోచ్చారణల మధ్య వేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం**

కేశంపేటమే 1(వుదయం) మండలం ఎక్లాస్ ఖాన్‌పేట గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నవమ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతియేటా అత్యంత వైభవంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఈసారి కూడా భక్తి శ్రద్ధల నడుమ అద్భుతంగా జరుగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తూ ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ రోజు నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కమనీయంగా, రమణీయంగా భక్తులను ఆకట్టుకునేలా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పవిత్ర వేడుకలో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తుల జయ జయధ్వానాలతో ఆలయం మార్మోగింది. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు. ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల్లో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, భక్తి భావాన్ని మరింత బలపరుస్తున్నాయి. మొత్తం కార్యక్రమం ఎంతో శ్రద్ధగా, వైభవంగా నిర్వహించబడుతూ భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ పవిత్ర కళ్యాణ మహోత్సవంలో గ్రామ ప్రజలతో పాటు షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ స్థాయి నాయకులు, కార్యకర్తలు, మీడియా మిత్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కర్రీ కోసం గొడవ కేసు..
## కత్తితో దాడి చేసిన ఆటో డ్రైవర్ అరెస్ట్..

అమీన్ పూర్ , మే 1 (వుదయం)




10 రూపాయల కూర విషయంలో జరిగిన చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, ఒక వ్యక్తిపై ప్రాణాంతక దాడికి దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే బీరంగూడలోని అంబేద్కర్ కాలనీకి చెందిన పుట్టగడ్డల రత్నయ్య అలియాస్ జీవరత్నం (32), వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఏప్రిల్ 25వ తేదీ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో, రత్నయ్య తన ఇంట్లో
అద్దెకు ఉండే రాజు అనే వ్యక్తి మోటార్ సైకిల్ తీసుకుని తహశీల్దార్ ఆఫీస్ సమీపంలోని ఓం శ్రీ సాయి కర్రీ పాయింట్ కు వెళ్ళాడు.అక్కడ రూ. 10లకు కర్రీ ప్యాకెట్ ఇవ్వాలని అడగగా, అక్కడి సిబ్బంది కర్రీ ధర రూ. 30 అని చెప్పారు. దీంతో మేము లోకల్, మాకు పది రూపాయలకే ఇవ్వాలంటూ రత్నయ్య గొడవకు దిగాడు. అయితే యజమాని సిబ్బంది నిరాకరించడంతో వాగ్వాదం పెరిగి, చివరకు వారు రత్నయ్యను బయటకు పంపించేశారు. అక్కడి నుంచి వెళ్ళిపోయిన రత్నయ్య, కొద్దిసేపటి తర్వాత తీవ్ర ఆవేశంతో, చేతిలో తల్వార్ పట్టుకుని తిరిగి వచ్చాడు.
దుకాణం లోపలికి చొరబడి ఒక్కసారిగా షట్టర్ మూసివేసి,
అక్కడున్న వారిని బూతులు తిడుతూ భయభ్రాంతులకు
గురిచేశాడు. అంతటితో ఆగకుండా కౌంటర్లో ఉన్న ఉదయ్ భాను అనే వ్యక్తి తలపై తల్వార్‌తో బలంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఉదయ్ భాను తీవ్రంగా గాయపడ్డారు.బాధితుల పిర్యాదు తో కేసు నమోదు చేసుకున్న అమీన్ పూర్ పోలీసులు ఘటన జరిగినప్పటి నుండి పరారీలో ఉన్న రత్నయ్య పై నిఘా పెట్టారు. శుక్రవారం నాడు బట్టలు, డబ్బులు తీసుకుని సుదూర ప్రాంతానికి పారిపోయేందుకు ఇంటికి రాగా, పోలీసులు మాటువేసి పట్టుకున్నారు.
ఈ మేరకు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్.ఐ. రామాంజనేయులు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

## లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శివ ప్రకాష్: లోక కల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు.

శంకర్‌పల్లి, మే 01 (వుదయం)




చైతన్యపురి డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ (కోసగుండ్ల) ఫణిగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం లక్ష్మీ నరసింహ స్వామి వారి జయంతిని పురస్కరించుకొని జయంతి కళ్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ప్రధాన గర్భగుడిలో స్వామివారి ఆశీర్వాదం పొందిన అనంతరం భక్తులతో కలిసి జయంతి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని ఆయన ఈ సందర్భంగా ప్రార్థించారు.అలాగే ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి శివ ప్రకాష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు.
దేవస్థానం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు,
భక్తుల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలపై చైర్మన్ వివరించారు. ఆలయ అభివృద్ధికి ప్రజలు, దాతలు సహకరించాలని కోరుతూ, స్వామి వారి కృపతో ఆలయాన్ని మరింతగా విస్తరించే దిశగా కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, తోట శీను యాదవ్, నరేందర్ రెడ్డి, శ్రీహరి, గన్ మన శ్రీనివాస్, కనకరాజు, సాయినాథ్ రాజ్, రమేష్, గణేష్, నాగరాజ, గానీ, పవన్, మహేష్, ఆసిఫ్, టోనీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు కూడా భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జయంతి కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజలు, హారతులు, భజనలు భక్తులను ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపాయి.

## పాశమైలారం పారిశ్రామిక వాడలో ఘనంగా మేడే వేడుకలు.. కార్మికుల భారీ బైక్ ర్యాలీ



శంకర్‌పల్లి, మే 01 (వుదయం) ప్రపంచ కార్మికుల దీక్ష దినం మేడే సందర్భంగా పాశమైలారం పారిశ్రామిక వాడలో సీఐటీయూ అనుబంధ యూనియన్ల ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కిర్బీ, సెనర్జీ, కోహన్స్ ఫార్మా, పార్లే ఆగ్రో, బిస్లరీ ఇంటర్నేషనల్, హింజల్, వాగ్వాల్స్ వంటి ప్రముఖ పరిశ్రమల వద్ద కార్మికులు పెద్ద ఎత్తున సమీకృతమై ఎర్రజెండాలు చేతబట్టి మేడేను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక హక్కులు, జీవన భద్రత, వేతనాల పెంపు వంటి అంశాలపై చర్చలు జరిగాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ మాట్లాడుతూ, మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం మరింత ఏకతాటిపై నిలబడి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులకు వ్యతిరేకమని, అవి కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం సమరశీల పోరాటాలు చేయాలని, కార్మికుల శక్తిని ఉద్యమంగా మలచాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం పారిశ్రామిక వాడలో కార్మికులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్మికులు "మేడే వర్ధిల్లాలి, ఎర్రజెండా వర్ధిల్లాలి, లేబర్ కోడ్స్ రద్దు చేయాలి, ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీని ఉత్సాహంగా కొనసాగించారు. కార్మికుల నినాదాలతో పారిశ్రామిక ప్రాంతం మార్మోగిపోయింది. మేడే రోజున కార్మికుల పోరాట సంకల్పాన్ని చాటేలా ర్యాలీ అత్యంత ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమంలో కిర్బీ యూనియన్ జనరల్ సెక్రెటరీ వి.ఎస్ రాజు, సెనర్జీ జనరల్ సెక్రెటరీ శాంత్ కుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాజు, పార్లే జనరల్ సెక్రెటరీ సంతోష్ గౌడ్, బిస్లరీ జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి, వాగ్వాల్స్ జనరల్ సెక్రెటరీ ఆఫీజ్, హింజల్ జనరల్ సెక్రెటరీ రోషన్తో పాటు యూనియన్ నాయకులు శ్రీనివాస్, నాగప్రసాద్, లక్ష్మణ్, సుధాకర్, విట్టల్, శ్యామ్, సోమన్న, మహేశ్వర్ రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మొయినాబాద్‌లో ఘనంగా మే డే వేడుకలు
## కార్మికుల పోరాట స్ఫూర్తికి నివాళి — నేతల పిలుపు




చేవెళ్ల, మే 1 (వుదయం) ప్రపంచవ్యాప్తంగా శ్రామికుల పండుగగా జరుపుకునే మే డే 1 సందర్భంగా మొయినాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ (INTUC) ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల నియోజకవర్గ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు మరియు లేబర్ సెల్ గౌరవ అధ్యక్షురాలు పామేనా జ్యోతి బీమ్ భరత్,పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్మికులు తమ చెమట చుక్కలతో దేశ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని కొనియాడారు.అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మే డే కేవలం పండుగ కాకుండా ఒక చారిత్రాత్మక పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. మే డే చరిత్ర - పోరాటానికి ప్రతీక 19వ శతాబ్దంలో కార్మికులు రోజుకు 1516 గంటలపాటు కష్టపడి పనిచేసే పరిస్థితులు ఉండేవి. "8 గంటల పని దినం" కోసం అమెరికాలోని చికాగోలో హేమార్కెట్ వద్ద జరిగిన పోరాటంలో అనేక మంది కార్మికులు ప్రాణత్యాగం చేశారు. వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం కరైతు పొలంలో శ్రమిస్తేనే అన్నం, కార్మికుడు కర్మాగారంలో పనిచేస్తేనే వస్తువులు, నిర్మాణ కార్మికుల కష్టం వల్లనే మనకు నివాసాలు సిద్ధమవుతాయని చెప్పారు. "శ్రమయేవ జయతే" అనే నినాదాన్ని గుర్తు చేస్తూ శ్రమకు ఉన్న గౌరవాన్ని తెలిపారు.
సంక్షేమమే దేశాభివృద్ధికి పునాదికార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, ఆరోగ్య సౌకర్యాలు కల్పించ
డం ప్రభుత్వ బాధ్యత అని, కార్మిక సంక్షేమమే దేశ సంక్షేమానికి దారి తీస్తుందని ఆమె స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో చేవెళ్ల లేబర్ సెల్ అధ్యక్షులు సయ్యద్ వసీం, టీపీసీసీ సభ్యులు మరియు తోలుకట్ట మాజీ సర్పంచ్ బొల్లిగిద్ద సత్యనారాయణ, మొయినాబాద్ లేబర్ సెల్ మండల అధ్యక్షులు కే. హరేందర్ గౌడ్, గ్రామ అధ్యక్షులు వడ్ల రవీందర్ చారి, నాయకులు ఇంద్రసేన గౌడ్, శ్రీకాంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఘనంగా "మహనీయుల జాతర"
## సమానత్వం, సామాజిక న్యాయం సందేశాలతో సభ

చేవెళ్ల, మే 1 (వుదయం)



మహనీయుల సిద్ధాంతాలను నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. చేవెళ్లలో మహనీయుల సందర్భంగా గురువారం నిర్వహించిన "మహనీయుల జాతర" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మహనీయుల జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీని ఎమ్మెల్యే కాలె యాదయ్య జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా బసవేశ్వర విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం కేజీఆర్ గార్డెన్‌లో జరిగిన సభను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా దళితసేన జాతీయ అధ్యక్షులు జె.బి. రాజు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశిం, బసవ మహామానే ట్రస్టు అధ్యక్షులు డా. సిద్ధ రామేశ్వర్ శరణారు బెల్జాల్ మరియు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పామేన భీమ్ భారత్ మాట్లాడుతూ.. మహనీయులు తమ జీవితాలను సమాజం కోసం అంకితం చేశారని గుర్తుచేశారు.బుద్ధుడు సమానత్వాన్ని బోధించాడని, మహాత్మా జ్యోతిరావు పూలే మహిళా విద్యకు పునాది వేశారని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దేశానికి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. సామాజిక న్యాయం కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలను స్మరించారు.బహుజన రాజ్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలిఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ...మహనీయుల విగ్రహాల వద్ద జయంతులు జరపడం మాత్రమే కాకుండా, వారి ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుల మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, అంబేద్కర్ సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGEHYDERABAD DISTRICT, AT:HYDERABAD**
**O.S.No. 929 of 2026**
**Between:**
1. Smt. Sattiraju Padmavathi Devi,W/o Late Maddali Venkateswara Rao, Aged about 63 years, Occ: Retired Govt Employee, R/o Flat no.306, Vamshi Krishna Apartments, 7-1-214, D K Road, Ameerpet, Hyderabad, Telangana.
2. Sri. Maddali Ravi Chandra, S/o Late Maddali Venkateswara Rao, Aged about 37 years, Occ: Pvt Employee, R/o Flat no.306, Vamshi Krishna Apartments, 7-1-214, D K Road, Ameerpet, Hyderabad, Telangana
**...Plaintiff**
**AND**
1. The Tahsildar, Ameerpet Mandal, Hyderabad.
2. All Concerned
**...Defendants**
All Concerned
Whereas you are hereby informed that the above-named Plaintiffs filed the above O.S. against you **PLAINT FILED UNDER ORDER VII RULE 1 R/W SEC. 26 OF C.P.C. SUITFOR DECLARATION TO DECLARE THE PLAINTIFFS ARE THE LEGAL HEIRS OFLATE. MADDALI VENKATESWARA RAO** In the above suit, the matter is coming for your appearance. The matter stands posted to **04-05-2026** for your appearance and if you have any objections. You have to appear in person or through an Advocate on thatday in the above court at 10.30 A.M. otherwise the matter will be decided in yourabsence, as per law.
**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**k.shiva shanker**
**Advocates,**
**Hyderabad-80**
**PH: 9000013069 H.no 608/E/73. Mothilal Nehru Nagar: Lower Tank Bund Hyderabad-500080**

**IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI**
**O.S.No. 254 of 2026**
**Between:**
1. Bandi Shiva Shanker Goud, S/o. Bandi Hari Shanker Goud, Aged about 37 years, Occ: R/o. H.No.4-391/4/K, Medapati Nagar Colony, Ghatkesar, Medchal-Malkajgiri District.
2. Akkangar Archana W/o. Akkangar Arun Kumar Goud, Aged about 32 years, Occ: Housewife, R/o. H.No.6-76, Patancheru Mandal, Lakdaram, Sangareddy, Telangana-502307
*...Plaintiff*
**AND**
1. The Tahsildar, GhatkesarMandal, Medchal Malakgjiri District
2. All concerned
**...Defendants**
To,
All Concerned
Please take notice that the plaintiffs herein have filed a suit for declaring the plaintiffs as legal heirs of **Late BANDI RENUKA W/O. BANDI HARI SHANKAR** who died on 16-10-2025 , leaving behind her Plaintiffs 1 and 2 , If anybody is having objections or any claims in the said matter, they should appear before the above said court on 06-07-2026 at 10.30AM failing which the matter willbe decided according to the court of law.
**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**M/s. G.SRAVANTHI, Advocate, Hyderabad**

## తిమ్మాపూర్‌లో ఘనంగా మే డే వేడుకలు

సిద్దిపేట, మే 1 ( వుదయం ) సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో మే డే సందర్భంగా శుక్రవారం హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఉషి కనకరాజు జెండా ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్మికులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ హమాలీ కార్మికులను, సపాయి కార్మికులను, ఆటో కార్మికులను, పెయింటింగ్ కార్మికులను సర్పంచ్ శాలువాతో సన్మానించారు.
ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్మికులకు కనీస వేతనం, భద్రత, సముచిత పని గంటలు వంటి ప్రాథమిక హక్కులు అందాలని పేర్కొన్నారు. కార్మిక చట్టాల రూప శిల్పి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని ఆ చట్టాలు శ్రమ దోపిడీకి గురికాకుండా కార్మికులంతా ఏకమై పోరాడాలని సూచించారు.
అలాగే కష్టపడి పని చేసే కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకువచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల పుకొని కార్మిక రాజ్యం రావడం కోసం ఆత్మగౌరవంగా అంతిమ లక్ష్యం భారతదేశ కార్మిక చట్టాల రూప శిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆశయ సాధన కోసం కార్మికులు ముందుకు గ్రామ సర్పంచ్ వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నెల విజయకుమార్ తో పాటు వార్డ్ మెంబర్లు గుర్రాల నరేష్,ఇరుకోటి నర్సింలు, పోసన్న గారి శివకుమార్, మండల కనకయ్య, ఆటోయూనియన్ కార్మికులు మండల కనకయ్య, మార్కంటి నరేష్, మండల లక్ష్మి నారాయణ, ఐకేపీ కార్మికులు ఇర్కోటి రవీందర్, గుర్రాల పద్మ, పేంటింగ్ కార్మికులు రుద్రారం మల్లేశం, గుర్రాల రాజ నర్సయ్య,హమాలీ కార్మికులు రమేష్,మల్లారెడ్డి బాపు రెడ్డి,మండల పర్శరాములు, వంగ రాజు, మల్లారెడ్డి, తిరుపతి, ప్రభాకర్ శేఖర్, పాలకవర్గం సభ్యులు గుర్రాల నరేష్,ఇర్కోటి నర్సింలు, పోసనగారి శివ కుమార్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



"పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేసిన ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయతను ఏమిటి? గతంలో ఆ అంచనాలు తప్పని రుజువైన సందర్భాలు లేవా? ఇప్పటివరకు ఏ ఎగ్జిట్ పోల్ వాస్తవమని తేలింది? ఐదేళ్ల క్రితం పశ్చిమ బెంగాల్ ఎన్నికల సమయంలో కూడా, దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అధికారం భారతీయ జనతా పార్టీకే దక్కుతుందని అంచనా వేశాయి. కానీ ఫలితం ఏమిటి? కాబట్టి మనం ఇంకెంతో కాలం వేచి ఉండాల్సిన అవసరం లేదు. సోమవారం నాడు మనం సచివాలయంలో గౌరవ వందనం స్వీకరిస్తున్నప్పుడు, ఫలితాలు కూడా వెలువడతాయి. నాకు తెలిసినంతవరకు, ఈ ఎగ్జిట్ పోల్స్ మరోసారి తప్పని రుజువవుతాయి. నిజానికి, ఒక ఏజెన్సీ అయితే తమ ఎగ్జిట్ పోల్‌ను ప్రచురించడానికి కూడా నిరాకరించింది. బహుశా ఆ ఫలితాలు తమకు అనుకూలంగా లేకపోవడం వల్ల, వారు దానిని పూర్తిగా విరమించుకోవాలని నిర్ణయించుకున్నారు."

**- ఒమర్ అబ్దుల్లా, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి**

## వే'మన' పద్యం

**పరగ రాతిగుండు పగులగొట్టను వచ్చు**
**కొండలన్ని పిండి గొట్టవచ్చు**
**కఠినచిత్తు మనసు కరిగింపగారాదు**
**విశ్వదాభిరామ వినురవేమ**



## సంపాదకీయం

# తిరుగు లేని సుప్రీం న్యాయం

అందరికీ తెలిసిన విషయమే. కొత్తదేమీ కాదు. కాని మహిళ ఇష్టాయిష్టాల మీద ఆధారపడిన అతి సున్నితమైన అంశం.కేంద్ర ప్రభుత్వానికి, సుప్రీం కోర్టుకి లేదా అఖిల భారత వైద్య శాస్త్రాల సంస్థ(AIIMS)కు దేశ అత్యున్నత న్యాయస్థానానికి మధ్య వైరుధ్యాన్ని సృష్టించిన సమస్యగా మారింది. ప్రాణహాని కలిగించే ప్రమాదం ఏ కొంచెమో గల అరుదైన సందర్భంలో ప్రాణాన్ని కాపాడాలనే నెపం మీద అత్యున్నత విలువలు కూడిన ప్రజాస్వామిక హక్కును కాల రాయాలా, ఆధునిక వైద్య శాస్త్రం ప్రసాదించిన నైపుణ్యంతో ఇటు ప్రాణాన్ని అటు ప్రజాస్వామ్యాన్ని రెండింటినీ కాపాడే బాధ్యతను చాకచక్యంగా నిర్వర్తించాలా అనే మీమాంసలో సుప్రీం కోర్టు స్పష్టంగా ఎటువంటి రాజీకి చీమ దూరే సందు సైతం ఇవ్వకుండా రెండో దానివైపే మొగ్గడం చరిత్రాత్మక పరిణామం. రాజ్యాంగం 21వ అధికరణం కింద గర్భ విచ్చిత్తి విషయంలో ఆ మహిళదే అంతిమ నిర్ణయమని ఇటువంటి కేసుల్లో న్యాయస్థానాలు ఆ మహిళ వ్యక్తిగత గౌరవ హోదాలకు, శారీరక స్వయంప్రతిపత్తికి, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని చట్టం కంటే అవే ఉన్నతమైనవని స్పష్టంగా చెప్పింది. ఒక మైనర్ (15సంవత్సరాల) బాలిక మోస్తున్న 30 వారాల గర్భాన్ని తొలగించి తీరాలనిభారత ప్రధాన న్యాయ మూర్తి (సి జె ఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల భాగ్చి లతో కూడిన ధర్మాసనం గురువారం నాడు తీర్పు ఇచ్చింది.ఈ కేసులోనే ఇంతకు ముందొకసారి సుప్రీం కోర్టు ఇచ్చిన ఇదే తీర్పుపై ఢిల్లీ ఎయిమ్స్ అభ్యంతరం చెబుతూ దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్ ను విచారణకు స్వీకరించడానికి నిరాకరించిన తర్వాత సి జె ఐ ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది.ఏ మహిళ మీదనైనా తనకు ఇష్టం లేని గర్భాన్ని రుద్దకూడదు. ఆలోచించండి ఆమె బాలిక. ప్రస్తుతం ఆమె చదువుకుంటూ ఉండవచ్చు. అయినా ఆమె తల్లి కావలసిందేనని కోరుకుంటున్నాము. ఇది బాల్య అత్యాచారం కేసు. ఈ గర్భాన్ని అనుమతిస్తే ఆమె జీవితాంతం కుంగి కృశించిపోవలసి వస్తుంది. ఇప్పుడిది గర్భస్థ పిండానికి దానిని మోస్తున్న బాలికకు మధ్య పోరాటం.గర్భాన్ని భరించవలసిదిగా ఒక మైనర్ ఆడపిల్లను శాసించకూడదు.చట్టం చైతన్యవంతంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉండాలి అని ధర్మాసనం నొక్కి చెప్పింది.బాలికను రేప్ చేయగా వచ్చిన గర్భానికి సంబంధించి దానిని మోయాలా వద్దా అనే విషయంలో తుది నిర్ణయాధికారం ఆ బాలికదేనని కూడా ధర్మాసనం ఖచ్చితంగా చెప్పింది. బాలిక తనను ఆశ్రయించింది కాబట్టి 30 వారాల సమయంలో కూడా గర్భాన్ని తొలగించాలనే సి జె ఐ తో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. ఇందుకు రాజ్యాంగం 142 కింద తనకున్న విశేష అధికారాలను వినియోగించింది. 30 వారాల గర్భం అయినందున పిండం ఈ సరికి ప్రాణంగా మారి ఉండవచ్చని, దానిని తొలగిస్తే గర్భస్థ శిశుపిండం తీవ్ర లోపాలతో బయటపడవచ్చని పిండాన్ని మోస్తున్న బాలికకు కూడా శారీరక లోపాలు సంక్రమించి మళ్ళీ కడుపు పండే అవకాశాలను కోల్పోవచ్చని ఢిల్లీ ఎయిమ్స్ తరపున ఐశ్వర్య భాటి వాదించారు. అయినా అవాంఛనీయ గర్భాన్ని మోసి తీరాలని బలవంతం చేయడం తగదని సుప్రీం ధర్మాసనం గట్టిగా భావించడం బాగుంది.సుప్రీం కోర్టు ఇటువంటి తీర్పులిచ్చిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. అన్ని కేసుల్లోనూ అవాంఛిత గర్భాన్ని చట్టబద్ధంగా తొలగింపజేసుకునే హక్కు మహిళకు ఉన్నదనేదే దాని దృఢ అభిప్రాయం. 1971 నాటి వైద్యపరమైన గర్భ విచ్చిత్తి చట్టాన్ని 2021 లో సవరించారు.దీని ప్రకారం సాధారణంగా గర్భ విచ్చిత్తి గరిష్ఠ పరిమితి 24 వారాలు. కాని అవివాహిత మహిళలకు గర్భం వదిలించుకునే స్వేచ్ఛను అది కలిగించలేదు. వివాహిత, అవివాహిత అనే తేడా లేకుండా, సహేతుకమైన ఎంత ఆలస్యమైనా మైనర్ రేప్ కేసుల్లో గర్భం తొలగింపుకి అనుమతించేలా గర్భస్రావ చట్టాన్ని సవరించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని శిరసావహించవలసి వుంది.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## సామాన్యుడి కోసం

# ఒక కార్పొరేట్ ఆసుపత్రి!

### ఫీజు కేవలం రూ.10 మాత్రమే!



హైదరాబాద్ నగరానికి కొద్దిదూరంలో... యదాద్రి దారి మధ్యలో... 200 ఎకరాల పచ్చని విస్తీర్ణంలో ఒక ఆశ నిలబడి ఉంది. కార్పొరేట్ హాస్పిటల్స్ బిల్లుల భారంతో వంగిపోయిన సామాన్యుడికి, "తక్కువ ఖర్చులో కూడా అత్యుత్తమ వైద్యం సాధ్యం" అని నిరూపిస్తూ ఎదురు చూస్తోంది ఒక ప్రభుత్వ ఆసుపత్రి. అదే AIIMS Bibinagar.

ఒక్కసారి ఈ గేటు దాటితే... వైద్యం గురించి మీ అభిప్రాయం పూర్తిగా మారి పోతుంది.

**₹10తో ప్రారంభమయ్యే ఆరోగ్య భద్రత**

మన దేశంలో మంచి డాక్టర్‌ను కలవాలంటే కనీసం ₹500 నుంచి ₹1500 వరకు ఖర్చు అవుతుంది. కానీ ఇక్కడ కథ వేరేలా ఉంటుంది. కేవలం ₹10 టికెట్‌తోనే జనరల్ ఫిజీషియన్ నుంచి స్పెషలిస్ట్‌ల వరకు అన్ని విభాగాల డాక్టర్లను సంప్రదించవచ్చు. ఒక్కసారి ఆలోచించండి... అదే చికిత్సకు మీరు బయట ఖర్చు చేసే డబ్బుతో పోలిస్తే, ఇక్కడ మీరు వందల రూపాయలు ఆదా చేస్తున్నారు.

**హాస్పిటల్ కాదు... ఆరోగ్యానికి కొత్త అనుభవం**

200 ఎకరాల పచ్చదనం మధ్య విస్తరించిన ఈ క్యాంపస్‌లో అడుగు పెడితే, సాధారణ హాస్పిటల్ అనిపించదు. పరిశుభ్రత, గాలి, వెలుతురు ప్రతి మూలలోనూ కనిపిస్తాయి.

బెడ్‌లు, బాత్‌రూమ్‌లు మెరుస్తూ ఉండటం... రోగికి గౌరవంతో ట్రీట్మెంట్ ఇవ్వడం..ఇవన్నీ ఇక్కడ సాధారణం.

క్యాంటీన్‌లో కూడా సరసమైన ధరలు ₹75కి పూర్తి భోజనం. ఇది ఆరోగ్యంతో పాటు గౌరవాన్ని కూడా ఇస్తుంది.

**ప్రయాణం సులభం... చికిత్స వేగం**

బీబీనగర్‌కు రవాణా సౌకర్యాలు బాగా ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సులు, పురుషులకు తక్కువ ఛార్జీలు.

ఉదయం 7 గంటలకు బయలుదేరితే, పరీక్షలు పూర్తిచేసుకుని మధ్యాహ్నం 2లోపు ఇంటికి చేరుకోవచ్చు. ఉద్యోగానికి కూడా పెద్దగా అంతరాయం ఉండదు.

*750 బెడ్స్, 250 ఎమర్జెన్సీ బెడ్స్, దాదాపు 1000 మంది* వైద్యులు ఇది ఒక భారీ ఆరోగ్య వ్యవస్థ.

దేశం నలుమూలల నుంచి వచ్చిన రోగులకు, ఒకే చోట, ఒకే రకమైన నాణ్యమైన వైద్యం అందించడం దీని లక్ష్యం.

తెలుగు మాట్లాడే సిబ్బంది, రోగులతో సానుభూతిగా వ్యవహరించడం ఇది ఇక్కడి ప్రత్యేకత.

**అందరికీ అందుబాటులో టెస్టులు**

**ఆరోగ్య పరీక్షలు అంటే చాలా మందికి భయం డబ్బు కారణంగా. కానీ ఇక్కడ ఖర్చు కాదు, ఆరోగ్యం ముఖ్యం.**

| | ప్రైవేటు | ఈ ఆస్పత్రిలో |
|---|---|---|
| కంప్లీట్ బ్లడ్ టెస్ట్: | ₹800 | -₹135 |
| లివర్ & కిడ్నీ టెస్ట్: | ₹2000 | -₹450 |
| ECG + చెస్ట్ ఎక్స్‌రే: | ₹700 | -₹110 |
| థైరాయిడ్ టెస్ట్: | ₹900 | -₹200 |
| మామ్మోగ్రఫీ: | ₹4000 | -₹630 |

ఒక్కరోజులోనే వేల రూపాయలు ఆదా కావచ్చు. ఒక కుటుంబానికి అది నెల రోజుల ఖర్చు.

' ఇది కేవలం ఒక హాస్పిటల్ కాదు. మనలాంటి సాధారణ ప్రజల కోసం నిర్మించిన జాతీయ సంపద.

వైద్యం కోసం అప్పులు చేసి జీవితాన్ని భారంగా మార్చుకునే కుటుంబాలకు ఇది ఒక వెలుగు. మీ పరిచయంలో ఎవరికైనా చికిత్స కోసం ఇబ్బంది ఉంటే... ఒక మాట చెప్పండి. : ఒక్కసారి బీబీనగర్ ఎయిమ్స్‌కి వెళ్లి చూడండి." ఇది కేవలం తెలంగాణకే పరిమితం కాదు, దేశంలో ఎవరైనా వచ్చి ఆరోగ్యపరీక్షలు చేపించుకోవచ్చు. ఆధార్ కార్డు ఉంటే చాలు. ' అని ఈ ఆసుపత్రిలో పని చేస్తున్న జ్యోతి మాతో చెప్పారు.

సామాన్యుడి ఆరోగ్యం కూడా విలువైనదే అని గుర్తు చేస్తున్న ప్రదేశం ఇది.

మనకు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడం... మన ఆరోగ్యానికి మనమే ఇచ్చే గొప్ప బహుమతి.

**చిరునామా: బీబీనగర్, హైదరాబాద్ సమీపంలో**

**ఓపీ సమయం:** ఉదయం 9 గంటల నుంచి, 5 Pm (phone 08685293300 08685295050, )

ఈ కథ కేవలం ఒక హాస్పిటల్ గురించి కాదు, ఆరోగ్యం అందరికీ హక్కు అనే భావన గురించి.



శ్యాంమోహన్
9440595858

## కృష్ణ మాదిగ సొంత అజెండాకోసం

# పరివార్ జెండా ఎత్తుకున్నారా, లేక ?!



కులవ్యవస్థను రద్దు చేయాలనీ, అస్పృశ్యతను రూపుమాపాలనీ అన్న మంద కృష్ణ మాదిగ, గతంలో ఆర్.ఎస్.ఎస్. అధినేతలు గోల్వాల్కర్, బాలా సాహెబ్ దేవరస్ కూడా అదే అన్నట్టు వారి రచనలనుంచి ఉదహరించారు. ఆయన ప్రస్తావించినట్టు లేదు కానీ, ఆమధ్య ప్రస్తుత సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కూడా 'కులం ఒక సమస్య' అని వ్యాఖ్యానించారు.

దీనిని బట్టి అస్పృశ్యతనూ, దానికి మూలమైన కులవ్యవస్థనూ సమస్యలుగా ఆర్.ఎస్.ఎస్. ఎప్పుడో గుర్తించింది. కానీ ఇన్నేళ్లలోనూ వాటి నిర్మూలనకు ఉద్యమస్థాయిలో నడుం కట్టి ఏమైనా చేసిందా, చేయకపోతే ఎందుకు చేయలేదు, తమ భావజాలపక్షం అధికారంలోకి వచ్చాక చూద్దాములే అనుకుందా; లేక, అదో కందిరీగల తుట్టనీ, దానినిప్పుడు కదపకూడదనీ అనుకుని ఊరుకుందా -ఇలా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

నిర్దిష్ట భావజాలంతో పనిచేసే ఏ వర్గమైనా, ఏ పక్షమైనా దానికి తన రాజకీయవైఖరితోపాటు, మత, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వైఖరులను కూడా జోడించుకుని దానికొక సమగ్ర రూపం ఇవ్వడానికి మొదటే ప్రయత్నిస్తుంది. అటువంటిది, భారతీయసమాజంలో అతిముఖ్య పార్శ్వమైన కులవ్యవస్థనూ, దాని దుష్ఫలితమైన అస్పృశ్యతనూ ఆర్.ఎస్.ఎస్., ఇతర సంఘ పరివార్ సంస్థలు తమ భావజాలమథనంలో మొదటినుంచీ భాగం చేసుకున్నాయా, వాటిపై ఒక వైఖరిని తీసుకుని ప్రచారంలో ఉంచాయా, వాటి గురించి పట్టించుకోవలసినంతగా పట్టించుకున్నాయా, పట్టించుకోలేదనే అనుకుంటే అది పొరపాటున జరిగిందా, లేక ఇంకేవైనా కారణాలు అడ్డువచ్చాయా అనేవి సహజంగానే తలెత్తే మరికొన్ని ప్రశ్నలు.

నాకు తెలిసి కులవ్యవస్థా, దాని పర్యవసానమైన అస్పృశ్యతా సంఘపరివార్ అజెండాలో మొదటినుంచీ అంత గట్టిగా వినిపించినది కాదు; అస్పృశ్యత విషయంలో గాంధీ తీసుకున్న వైఖరీ, అమలు చేసిన కార్యాచరణలతో పోల్చి చూస్తే వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ నా ఈ అభిప్రాయాన్ని తోసిపుచ్చే ఆధారాలను ఎవరైనా ముందుకు తెస్తే నా అభిప్రాయాన్ని సవరించుకోడానికి సిద్ధమే.

మంద కృష్ణమాదిగ పై ప్రశ్నల్లోకి తలదూర్చలేదు కానీ, మీ నాయకులే తీవ్ర సమస్యగా గుర్తించిన అస్పృశ్యతా, దానికి మూలకారణమైన కులవ్యవస్థల విషయంలో ఇప్పుడు మీరేం చేయబోతున్నారన్నట్టుగా సంఘ పరివార్ మొత్తానికి ఒక సవాలు విసిరారు. సంఘ పరివార్ కు చెందిన కింది శ్రేణి నాయకులు, కార్యకర్తలు, వారి భావజాలాన్ని సమర్థించే ఇతరులూ 'నిజమే, కులవ్యవస్థా, అస్పృశ్యతా అంతరించవలసిందే'నంటూ మంద కృష్ణ మాదిగ డిమాండ్ కు నోటిమాటగా మద్దతు పలకవచ్చు. కానీ అది శంఖంలో పోసిన తీర్థం అవుతుందా? అయినప్పుడే కదా అది సంఘ పరివార్ విధానంగా జనంలోకి వెళ్ళి విశ్వసనీయతను తెచ్చుకోగలిగేది!

అది సంఘ పరివార్ విధానంగా మారి విశ్వసనీయతను ఎప్పుడు పొందుతుందంటే, మోహన్ భాగవత్ నోటా, ప్రధాని నరేంద్ర మోడీ నోటా, కనీసం బీజేపీలోనూ, ప్రభుత్వంలోనూ ద్వితీయ స్థానంలో ఉన్న అమిత్ షా వంటి వారి నోటా వినిపించినప్పుడూ, క్రియలో ఒక్క అడుగైనా ముందుకు పడినప్పుడూ! ఇక్కడ ఇంకో సమస్య ఏమిటంటే, వీరెవరూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం కానీ, అది అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పడం కానీ చేయరు. దాంతో, కులవ్యవస్థపైనా, అస్పృశ్యతపైనా వీరి వైఖరి ఏమిటో, వాటిని ఏమేరకు సమస్యలుగా గుర్తిస్తున్నారో, ఎటువంటి ఆలోచనలు చేస్తున్నారో, ఎటువంటి సందేశం ఇవ్వదలచుకున్నారో జనసామాన్యానికి తెలిసే అవకాశం ఉండదు. కింది శ్రేణి నాయకులూ, కార్యకర్తలూ ఏం మాట్లాడినా దానికి విలువ ఉండదు.

కనుక కులవ్యవస్థా, అస్పృశ్యతల నిర్మూలన విషయంలో సంఘపరివార్ లోని అత్యున్నతస్థాయి నేతల వైఖరీ, అందుకు వారు ఉద్దేశించిన కార్యాచరణా ఏమిటో స్పష్టం కానంతవరకూ మంద కృష్ణ మాదిగ డిమాండ్ గోడకు కొట్టిన బంతే అవుతుంది.

అయినాసరే, మంద కృష్ణ మాదిగ ఆ డిమాండ్‌ను, లేదా ఆ సవాలును ఎందుకు విసిరారు?! మళ్ళీ దీనికి కారణాలను ఊహించవలసిందే కానీ, ఇవీ అని ఇప్పటికిప్పుడు ఇదమిత్థంగా చెప్పలేము. ఇంతకుముందు నేను పెట్టిన పోస్టులపై పలువురు మిత్రుల స్పందనను గమనిస్తే నరేంద్ర మోడీతో కృష్ణ మాదిగ ఫొటో దిగారు కనుకా, ప్రభుత్వం కూడా ఆయనను పద్మశ్రీతో సత్కరించింది కనుకా, అలాంటి ఆధారాలు ఇంకా మరికొన్ని ఉన్నాయి కనుకా ఆయన సంఘపరివార్ కూటమికి దగ్గరై కాషాయీకరణ చెందాడనే భావన వాటిలో వ్యక్తమైంది. ఆయన కేవలం అవకాశవాది అయిన రాజకీయనాయకుడు మాత్రమేననీ, ఆయన మాటలను సీరియస్ గా తీసుకుని విశ్లేషణ పేరుతో సమయాన్ని వృథా చేసుకోనవసరం లేదని కూడా ఒక మిత్రుడు అన్నారు.

నా వరకు నేను ఈ క్షణాన కళ్ళముందున్న వాస్తవాలకు పరిమితమై చెబితే, మంద కృష్ణ మాదిగ మాదిగలకు రిజర్వేషన్లలో సంపూర్ణన్యాయం జరగాలని కోరుతూ గత 32 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇలా ఒక సామాజికవర్గానికో లేదా ప్రాంతానికో న్యాయం జరగాలని కోరే ఏ ఉద్యమ నాయకులైనా ఆ లక్ష్యసాధన కోసం అధికారంలో ఉన్న ఏ రాజకీయపక్షానికైనా దగ్గరవడానికీ, దాని సాయం అందుకోడానికీ ప్రయత్నిస్తారు. ఇప్పటికిప్పుడు స్ఫురిస్తున్న మరో ఉదాహరణ, ఆ మధ్య ప్రసిద్ధరచయిత బండి నారాయణస్వామి ఒక పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ అన్న మాటలు; రాయలసీమకు అన్నివిధాలా న్యాయం చేయడానికి ముందుకొస్తే నేను బీజేపీని సమర్థించడానికి సిద్ధమేనని ఆయన అన్నారు.

అదే సమయంలో ఇక్కడ గుర్తించవలసింది ఏమిటంటే, ఇటువంటి సహకారం ఏకపక్షంగా కాకుండా ఉభయపక్షంగా ఉంటుంది. ఎలాగంటే, కృష్ణ మాదిగ తదితరుల అజెండాకు ప్రభుత్వం సాయపడాలంటే; బీజేపీ, దాని ప్రభుత్వం కూడా భాగమైన సంఘ పరివార్ అజెండాకు వీరు కూడా సాయపడాల్సి ఉంటుంది. అంటే, తమ అజెండాను నెగ్గించుకోడానికి సంఘపరివార్ అజెండాకు సాయపడే రూపంలో వీరు మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందన్నమాట. సంఘపరివార్ అజెండా ఏమిటో స్పష్టమే... స్థూలంగా చెప్పాలంటే, ఈ దేశంలోని మెజారిటీ మతస్థులందరినీ కుల, వర్గ, ప్రాంత, భాషాభేదాలకు అతీతంగా మతం అనే గొడుగు కిందికి తెచ్చి సంఘటితం చేయడం! దేశాన్ని మతాధారిత రాష్ట్రంగా ప్రకటించడం!

ఇక్కడ ఇంకొకటి కూడా గుర్తుపెట్టుకోవాలి. సంఘపరివార్ తమ అజెండాకు కలిసివచ్చే మేరకే ఇటువంటి సామాజికవర్గ, ప్రాంతీయ అజెండాలకు సహకరించి, కలసిరావనుకున్నప్పుడు పక్కన పెట్టే అవకాశమూ ఉంటుంది. ఇది పెద్ద చేప చిన్న చేపను మింగేయడం లాంటిది.

ఇక్కడే కృష్ణ మాదిగ తదితరుల విషయంలో కొన్ని ప్రశ్నలు అనివార్యంగా తలెత్తుతాయి... సంఘ పరివార్ ప్రభుత్వం నుంచి తాము ఆశించే సహకారం ఏకపక్షంగా ఉండదనీ, వారి అజెండాకు తాము కలిసివచ్చే రూపంలో మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందనీ వారు గ్రహించారా, గ్రహించే ఆ పరిణామానికి వాళ్ళు సిద్ధమయ్యారా, లేక స్వయంగా సంఘపరివార్ భావజాలానికి ప్రభావితులై మతరూపంలో అది నిలబెట్టిన గొడుగు కిందికి ఇష్టపూర్వకంగా వెళ్లడానికి సిద్ధమయ్యారా, అవుతున్నారా; లేక ఇటువంటి పర్యవసానాలను గుర్తించలేని ఒక అయోమయస్థితిని ఎదుర్కొంటున్నారా అన్నవే ఆ ప్రశ్నలు. ఇవి కాలం తేల్చవలసిన ప్రశ్నలు కనుక అవుననీ, కాదనీ ఇప్పటికిప్పుడు సమాధానం చెప్పడం న్యాయం కాబోదు. అది నేను పాటించే పరిమితి.

గత పది, పదకొండేళ్ళ కాలంలో ఒక ముఖ్యమైన మార్పును ఇతరత్రా కూడా చూస్తున్నాం. అంతకు ముందు ఎప్పుడూ సంఘపరివార్ కు చెందిన పరిభాషను ఉపయోగించని వారు కూడా ఇప్పుడు ఉపయోగిస్తున్నారు. ఆవిధంగా ఇది కేవలం పది, పదకొండేళ్ళ స్వల్పకాలంలో సంఘపరివార్ సాధించిన విజయం. ప్రస్తుత కృష్ణ మాదిగ వైఖరి దానికి మరింత స్పష్టమైన అభివ్యక్తి కావచ్చునా అన్నది మళ్ళీ కాలం తేల్చవలసిన ప్రశ్నే.



కల్లూరి భాస్కరం
సీనియర్ జర్నలిస్ట్

## కొత్త జిల్లాల ఏర్పాటు సరిపోదు

# లడఖ్‌కు నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం

**ఇది 2019లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను రద్దు చేసినప్పటి నుండి అసంతృప్తితో రగిలిపోతున్న ఒక ప్రాంతపు తీవ్ర ఆందోళనలను పరిష్కరించకుండా, కేవలం సరిహద్దులను తిరిగి గీసే అధికారిక పటరచనగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. లడాఖీలకు, ఎన్ని జిల్లాలు ఉన్నాయనేది సమస్య కాదు, అధికారం ఎవరి చేతిలో ఉందనేదే అసలు సమస్య.**

లడఖ్‌లో ఐదు కొత్త జిల్లాల ఏర్పాటు పరిపాలనను మెరుగుపరచవచ్చు. కానీ, రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ రక్షణలు, ఎన్నికల ద్వారా ఏర్పడే పాలన వంటి కీలక డిమాండ్లను ఇది పరిష్కరించదని విమర్శకులు పేర్కొంటున్నారు. ఈ చర్య లడఖ్ రాజకీయ భవిష్యత్తుపై చర్చను తిరిగి రగులుకునేలా చేసింది.

లేహ్, కార్గిల్ జిల్లాల నుండి ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా, ఈ కేంద్ర పాలిత ప్రాంతంలోని మొత్తం జిల్లాల సంఖ్యను ఏడుకు చేర్చాలన్న లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా నిర్ణయం, ఒక సాహసోపేతమైన పరిపాలనా సంస్కరణగా అభివర్ణిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి సంబంధిత ప్రసంగాలలోని సుపరిచితమైన శైలినే ప్రతిధ్వనిస్తూ, ఈ చర్య పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తుందని, ఉద్యోగాలను సృష్టిస్తుందని, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుందని లెఫ్టినెంట్ గవర్నర్ పేర్కొన్నారు.

కాగితంపై చూసినప్పుడు, ఇది తిరుగులేనిదిగా అనిపిస్తుంది. ఆచరణలో, ఇది 2019లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను రద్దు చేసినప్పటి నుండి అసంతృప్తితో రగిలిపోతున్న ఒక ప్రాంతపు తీవ్ర ఆందోళనలను పరిష్కరించకుండా, కేవలం సరిహద్దులను తిరిగి గీసే అధికారిక పటరచనగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. లడాఖీలకు, ఎన్ని జిల్లాలు ఉన్నాయనేది సమస్య కాదు, అధికారం ఎవరి చేతిలో ఉందనేదే అసలు సమస్య.

**వాస్తవ రాజకీయ అధికారం కోసం డిమాండ్**

చారిత్రాత్మకంగా శ్రీనగర్ నీడలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతం, ఈ వివక్షకు నిజమైన విరుగుడు స్వయంప్రతిపత్తియే అని భావించిన బౌద్ధ సన్యాసి కుశక్ బకులా వంటి నాయకులకు ఒకప్పుడు మద్దతుగా నిలిచింది. విచిత్రమేమిటంటే, ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ కాశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం ద్వారా జరిగిన పునర్వ్యవస్థీకరణ, ఒక రకమైన అంతరాన్ని మరో రకమైన అంతరంతో భర్తీ చేసింది.

ఒకప్పుడు ఎన్నికైన ప్రతినిధులు పరిపాలనను నడిపించేవారు, కానీ ఇప్పుడు అధికారులే ప్రధానంగా పెత్తనం చెలాయిస్తున్నారు. శాసన సభ లేకపోవడం వల్ల ఏర్పడిన శూన్యాన్ని ఎన్ని కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినా పూరించలేరు. లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ నేతృత్వంలో జరుగుతున్న ఆందోళన ఈ వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. రాష్ట్ర హోదా, రక్షణలు, ప్రాతినిధ్యం కోసం వారి డిమాండ్లు కొత్తవి కావు, అసమంజసమైనవి కూడా కావు.



**ఆరవ షెడ్యూల్ డిమాండ్ తీవ్రతరం**

తమను ఆరవ షెడ్యూల్ పరిధిలోకి చేర్చాలన్న డిమాండే ఈ ఆందోళనకు ప్రధాన కారణం. జనాభాలో 97 శాతానికి పైగా గిరిజనులే కావడంతో, లడాఖీలు భూమి, వనరులు, ఉద్యోగాలు, సంస్కృతికి రాజ్యాంగ రక్షణ కోరుతున్నారు. ప్రస్తుత లడఖ్ స్వయంప్రతిపత్తి కొండ ప్రాంత అభివృద్ధి మండళ్లకు శాసనపరమైన అధికారం లేదు. అయితే, ఆరవ షెడ్యూల్, అస్సాం, మిజోరం, త్రిపుర, మేఘాలయలలో ఉన్నట్లుగా భూమి, అడవులు, సామాజిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారం గల స్వయం ప్రతిపత్తి జిల్లా మండళ్లను ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం ఉన్న ఏర్పాటును ఆర్టికల్ 240 కింద కేంద్రం మార్చగలిగే అవకాశం ఉండగా, దానికి భిన్నంగా ఆరవ షెడ్యూల్ మరింత పటిష్టమైన రక్షణలను కల్పిస్తుంది. భోటి, పుర్గి వంటి భాషలతోసహా స్థానిక ప్రత్యేక సంస్కృతులను పరిరక్షించడానికి, అలాగే పాలనలో స్థానికులకు నిర్ణయాత్మకమైన గొంతుక ఉండేలా చూడటానికి కూడా ఇది అత్యంత ఆవశ్యకమని భావిస్తున్నారు.

**ఆర్థిక, పర్యావరణ ఆందోళనలు**

ఆర్థిక ఆందోళనలు అశాంతిని మరింత పెంచుతున్నాయి. అక్షరాస్యత ఎక్కువగా ఉన్నప్పటికీ, నిరుద్యోగం సుమారు 26 శాతంగా ఉంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత పాలనలో బయటివారి వల్ల తమను వెలివేస్తారేమోనని స్థానికులు భయపడుతున్న తరుణంలో, పరిపాలనా విస్తరణ ద్వారా ఉద్యోగాలు ఇస్తామన్న హామీ డొల్లగా మిగిలింది. ఇప్పుడు లడఖ్‌లో ఎవరైనా భూమిని కొనుగోలు చేయవచ్చు.

సోనమ్ వాంగ్‌చుక్ వంటి కార్యకర్తలు వ్యక్తం చేసిన పర్యావరణ ఆందోళనలు, ఈ విషయానికి మరింత ప్రాధాన్యతను చేకూరుస్తున్నాయి. అనియంత్రిత పర్యాటకం, పారిశ్రామిక ఆశయాలు వంటివన్నీ కూడా సుదూర ఆదేశాల ద్వారా నిర్వహించలేని ఒక సున్నితమైన పర్యావరణ వ్యవస్థకు ముప్పు కలిగిస్తున్నాయి.

**నిర్మాణాత్మక సంస్కరణల అవసరం**

అంతిమంగా, కొత్త జిల్లాలు స్వల్ప పరిపాలనా ప్రయోజనాలను అందించవచ్చు, కానీ అవి రాజకీయ సాధికారతకు ప్రత్యామ్నాయం కాలేవు. లడాఖీలు మరిన్ని కార్యాలయాలను అడగడం లేదు. వారు తమ వాణిని వినిపిస్తున్నారు. రాష్ట్ర హోదా, అర్థవంతమైన రాజ్యాంగ రక్షణ లేకుండా, ఇటువంటి చర్యలు ఒక వ్యవస్థాగత సమస్యకు పైపై పూతలుగా మాత్రమే మిగిలిపోతాయి.

# జాతీయం-అంతర్జాతీయం

## 'సీఎం మద్యం తాగి వచ్చారు' పంజాబ్ అసెంబ్లీలో దుమారం



**మే 1 వుదయం డెస్క్ :**

పంజాబ్ అసెంబ్లీ లో దుమారం చెలరేగింది. సీఎం భగవంత్‌మాన్ మద్యం తాగి వచ్చారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. మే డే సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పలుమార్లు తడబడ్డారని అన్నారు. సభ్యులందరికీ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని స్పీకర్‌ను కోరారు. భగవంత్‌మాన్ అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సమయంలో ఆయన మద్యం మత్తులో ఉన్నారని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపించడంతో ఈ వివాదం చెలరేగింది.

సీఎం అసెంబ్లీలో మాట్లాడుతున్న వీడియోను శిరోమణి అకాలీదళ్ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి మద్యం సేవించి అసెంబ్లీకి రావడం సిగ్గుచేటని ఆ పార్టీ విమర్శించింది. నిజానిజాలు బయటపెట్టడానికి ప్రజల సమక్షంలో భగవంత్‌మాన్‌కు డోప్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. దీనిపై సీఎం స్పందిస్తూ..ఈ ప్రత్యేక సమావేశంలో వాదనలకు దూరంగా ఉండి హుందాగా ప్రవర్తించాలని కోరారు.

## ఎన్నికల కౌంటింగ్ ముందు
# సుప్రీం కోర్టుకు తృణమూల్

**మే 1 వుదయం డెస్క్ :**

దేశవ్యాప్తంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. మే 4న ఓట్ల లెక్కింపు ఉంది. కౌంటిక్ ముందు మరో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మే 4న జరిగే ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులను మాత్రమే నియమించాలన్న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిర్ణయాన్ని సవాల్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను తప్పించడంపై టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది.

అ పిటిషన్‌ను అత్యవసరం విచారించాలని టీఎంసీ సుప్రీంకోర్టును కోరింది. అయితే ప్రధాన న్యాయమూర్తి ఈ కేసును శనివారం విచారణకు తీసుకునే అవకాశం ఉన్నట్లు



సమాచారం. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అంతకుముందు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు, పోలీసులు టీఎంసీ కార్యకర్తల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

ఇటీవల, పశ్చిమ బెంగాల్ అదనపు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఒక ప్రకటనలో.. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఉండే కౌంటింగ్ సూపర్‌వైజర్ లేదా కౌంటింగ్ అసిస్టెంట్‌లలో కనీసం ఒకరు కేంద్ర ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ) ఉద్యోగి అయి ఉండాలని చెప్పారు. అయితే, ఇలాంటి ఉత్తర్వులను ఎన్నికల సంఘం మాత్రమే జారీ చేయగలదని, అదనపు సీఈఓ కాదని వాదిస్తూ టీఎంసీ ఈ ఆదేశాన్ని సవాలు చేసింది.

ఎన్నికల హ్యాండ్ బుక్ ప్రకారం కౌంటింగ్ సిబ్బంది కేంద్ర ఉద్యోగులే ఉండాలని ఎక్కడా చెప్పలేదని పేర్కొంది. మైక్రో అబ్జర్వులు మాత్రం సాధారణంగా కేంద్ర సర్వీస్ నుంచి వస్తారని, కానీ కౌంటింగ్ సిబ్బందికి ఈ నిబంధనలు వర్తింపచేయడం అన్యాయమని టీఎంసీ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ ప్రభావానికి లోనయ్యే అవకావం ఉందని, ఇది సమాన పోటీకి విఘాతం కలిగిస్తుందని టీఎంసీ ఆరోపించింది. అయితే, టీఎంసీ ఈ వాదనను అంతకుముందు కలకత్తా హైకోర్టు తిరస్కరించింది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కేంద్ర లేదా రాష్ట్ర ఉద్యోగుల్ని నియమించుకోవచ్చని స్పష్టం చేసింది. ఇప్పటికే కౌంటింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి భద్రతా చర్యలు ఉన్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే టీఎంసీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## హిమంత వ్యాఖ్యలతో బంగ్లాదేశ్‌లో కలకలం



**మే 1 వుదయం డెస్క్ :**

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన ప్రకటనలో బంగ్లాదేశ్ ఉలిక్కిపడింది. అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల్ని రాత్రి సమయంలో వారి దేశానికి తోసేస్తాం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ రియాక్ట్ అయింది. భారత తాత్కాలిక హైకమిషన్ పవన్ బధేకు అధికార నిరసన తెలిపింది. డైరెక్టర్ జనరల్(దక్షిణాసియా) ఇష్రత్ జహాన్ గురువారం భారత దౌత్యవేత్తకు బంగ్లాదేశ్ వైఖరిని తెలియజేశారు.

"మర్యాద లేని వారికి మృదువైన భాష అర్థం కాదు. అస్సాం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టేటప్పుడు మేము ఈ విషయాన్ని నిరంతరం గుర్తుంచుకుంటాము. నిన్న రాత్రి 20 మంది అక్రమ బంగ్లాదేశీయులను వెనక్కి పంపించాము'' అని హిమంత అన్నారు.

ఈ ప్రకటనపై బంగ్లాదేశ్ అభ్యంతరం తెలుపుతోంది. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను ఇవి దెబ్బతీస్తాయని ఇష్రత్ భారత దౌత్యవేత్తలో అన్నారు. ఈ వ్యాఖ్యలు బంగ్లాదేశ్‌భారత్ సంబంధాలకు అవమానకరమని బంగ్లా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించేటప్పుడు సంయమనం పాటించాలని కోరింది. 2024లో హసీనా ప్రభుత్వ పతనం తర్వాత, అధికారంలోకి వచ్చిన మహ్మద్ యూనస్ భారత వ్యతిరేకతను బంగ్లాదేశ్ వ్యాప్తంగా పెంచి పోషించారు. ఆ సమయం భారత్‌బంగ్లా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ప్రధాని తారిక్ రెహ్మాన్ నేతృత్వంలోని ప్రభుత్వం భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది.

## 85%చూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్
### వైద్య కారణాలతో విడుదల కోరుతూ కోర్టుకు అప్పీల్

**మే 1 వుదయం డెస్క్ :**

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉన్నారు. తన ఆరోగ్యం క్షీణిస్తోందని, జైలు పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని పేర్కొంటూ, వైద్య, మానవతా కారణాలతో తన విడుదలను కోరుతూ ఇస్లామాబాద్ హైకోర్టును అభ్యర్థించారు. ఇమ్రాన్ ఖాన్ తరపు న్యాయవాది సల్మాన్ సఫ్దర్ కోర్టుకు తెలిపారు.. "ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కేవలం 15 శాతం మాత్రమే మిగిలి ఉంది. అంటే ఆయన దృష్టిలో 85 శాతం కోల్పోయారు." ఈ సమస్య శాశ్వతమైనదని, వైద్యులు కూడా దీన్ని కోలుకోలేని పరిస్థితిగా అభివర్ణించారని న్యాయవాది వాదించారు. ఇస్లామాబాద్ హైకోర్టులో జరిగిన విచారణలో, జైలులో సుదీర్ఘకాలం ఏకాంత నిర్బంధం కంటి సమస్యల కారణంగా ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని న్యాయవాది తెలిపారు.

ఆదియాలా జైలులో తగిన వైద్య సౌకర్యాలు లేకపోవడం వల్ల ఆయనను అనేకసార్లు ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిందని కూడా పేర్కొన్నారు. న్యాయవాది సల్మాన్ సఫ్దర్ మరిన్ని అంశాలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీను ఎందుకు ఏకాంత నిర్బంధంలో ఉంచుతున్నారో వివరణ కోరారు. పంజాబ్ జైళ్ల ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, ఆదియాలా జైలు సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్‌లను కోర్టు ముందు హాజరుపరచాలని అభ్యర్థించారు.



ఇమ్రాన్ ఖాన్ పూర్తి వైద్య రికార్డులను ఆసుపత్రి నుంచి కోర్టుకు సమర్పించాలని డిమాండ్ చేశారు.

విచారణ సందర్భంగా, ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సర్దార్ ముహమ్మద్ సర్ఫరాజ్ డోగర్ ప్రధాన అప్పీల్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. అయితే, శిక్ష నిలుపుదల పిటిషన్‌పై ముందుగా నిర్ణయం తీసుకోవాలని ఇమ్రాన్ తరపు న్యాయవాది పట్టుబట్టారు. దీంతో కోర్టు విచారణను వాయిదా వేసింది. ఇమ్రాన్ ఖాన్ ఆయన భార్య బుష్రా బీబీ అల్‌ఖాదిర్ ట్రస్ట్ కేసు (190 మిలియన్ పౌండ్ల అవినీతి కేసు)లో శిక్షలు అనుభవిస్తున్నారు. నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (NAB) ఆరోపణల ప్రకారం, బ్రిటన్ నుంచి వచ్చిన డబ్బును ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా, ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త జరిమానాలు చెల్లించడానికి ఉపయోగించి, ప్రతిఫలంగా ఖాన్ ట్రస్ట్‌కు విలువైన భూములు బహుమతిగా అందుకున్నారని ఆరోపించారు.

## పెన్షనర్లకు కేంద్రం శుభవార్త
### రూ. 7,500లకు పెరగనున్న కనీస పెన్షన్..?

**మే 1 వుదయం డెస్క్ :**

రిటైర్మెంట్ తర్వాత గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి పెన్షన్ అనేది ప్రధాన ఆధారం. అయితే.. ప్రస్తుత కాలంలో వస్తున్న వెయ్యి రూపాయల కనిష్ట పెన్షన్ ఏ మూలకూ సరిపోవడం లేదన్నది చేదు నిజం. ఈ నేపథ్యంలో.. లక్షలాది మంది ఈపీఎస్95 (EPS 95) పెన్షనర్లకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకోబోతోంది.

**రూ. 7,500లకు పెన్షన్ పెంపు..?**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ మేరకు, కనిష్ట పెన్షన్‌ను ప్రస్తుతమున్న రూ. 1,000 నుంచి రూ. 7,500లకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. కార్మిక సంఘాలు, పార్లమెంటరీ కమిటీ కూడా ఈ ప్రతిపాదనకు మద్దతు తెలపడంతో.. దీనిపై సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇదే జరిగితే సామాన్యులకు, ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాల రిటైర్డ్ ఉద్యోగులకు ఇది పెద్ద



వరం కానుంది.

**ముఖ్యమైన మార్పులు ఇవే..**

ఈపీఎఫ్ఓ తన సేవలను మరింత సులభతరం చేస్తోంది. త్వరలో ఏటీఎం ద్వారా డబ్బులు విత్ డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. పీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును అందించే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను డిజిటలైజేషన్ చేయడం ద్వారా కాగితపు పని తగ్గించి, వేగంగా నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రయోజనం ఎవరికి..?**

పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులతో ఇబ్బంది పడుతున్న లక్షలాది మంది వృద్ధులకు ఈ నిర్ణయం కొండంత అండగా నిలుస్తుంది. కేవలం పెన్షన్ పెంచడమే కాకుండా, పీఎఫ్ నగదును సులభంగా పొందేలా చేస్తున్న మార్పులు రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక భద్రతను పెంచుతాయి. ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ ఈ వార్త కోట్లాది మంది పెన్షనర్లలో కొత్త ఆశలను చిగురింపజేస్తోంది.

## ఆపరేషన్ సింధూర్‌కు ఏడాది
### మరోసారి మీడియా ముందుకు ఆ ఇద్దరు..



**మే 1 వుదయం డెస్క్ :**

పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా గతేడాది మే7న భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. ఆనాటి ఆపరేషన్ విషయాలను వెల్లడించి.. దేశ ప్రజల దృష్టిని ఆకర్షించిన అధికారిణులు మరోసారి మీడియా ముందుకు రానున్నారు. మే7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది కావస్తుండడంతో అదే తేదీన కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు అధికార వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఈ ఇద్దరు అధికారిణులతో పాటు ఈ మీడియా సమావేశంలో నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి వారు మాట్లాడే అవకాశం ఉంది. దేశ రక్షణలో పెరుగుతున్న మహిళా అధికారుల పాత్రను దేశ ప్రజలకు తెలియజేయడం కూడా ఈ కార్యక్రమం వెనుక ఉన్న మరో ఉద్దేశంగా తెలుస్తోంది.

గుజరాత్‌కు చెందిన సోఫియా బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990ల్లో సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కోర్‌కు చెందిన సీజన్డ్ ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు.

## 57వ అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవం
### సంచాలకునిగా అశుతోష్ గోవారికర్ నియామకం



**మే 1 వుదయం డెస్క్ :**

గోవాలో జరగనున్న 57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్‌ఎఫ్ఐ) సంచాలకునిగా ప్రముఖ చలనచిత్ర నిర్మాత అశుతోష్ గోవారికర్‌ను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నియమించింది. గోవారికర్ భారతీయ సినిమాకు విశిష్టమైన సేవలందించిన ప్రముఖ చలనచిత్ర నిర్మాత. ఐఎఫ్ఎఫ్ఐతో ఆయనకు దశాబ్దాల అనుబంధం ఉంది. ఇది చలనచిత్ర కళల పరిణామం, అంతర్జాతీయ సినిమా సంస్కృతితో ఆయనకున్న ప్రగాఢ అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ నియామకం పట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, గోవారికర్ ఇలా అన్నారు... "గోవాలో జరిగే ప్రతిష్టాత్మక 57వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవానికి ఫెస్టివల్ డైరెక్టర్‌గా సేవ చేయడం నాకు అపారమైన గౌరవాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. ఈ ఉత్సవ పరిణామక్రమాన్ని చూస్తుండడం నా అదృష్టం. 1984లో తొలిసారి ఈ ఉత్సవాలకు హాజరైనప్పటి నుంచి, 2024లో అంతర్జాతీయ సినిమాకు జ్యూరీ అధ్యక్షుడిగా పనిచేసే వరకు దీనితో నా అనుబంధం కొనసాగుతూ వస్తోంది". "1952 నుంచి దశాబ్దాలుగా ఎంతోమంది ఉత్సవ కమిటీ సభ్యులు రూపొందించిన, అభివృద్ధి చేసిన, విస్తరించిన ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లడం ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇప్పుడు ఈ నూతన బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతోనూ, గోవా ప్రభుత్వంతోనూ కలిసి సమన్వయంతో పనిచేయడానికి నేను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని ఆయన జోడించారు. 1952లో స్థాపించిన అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం... ఆసియాలోని ప్రముఖ చలనచిత్రోత్సవాల్లో ఒకటిగా నిలుస్తూ, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తూ, ప్రపంచ సినిమాలోని ప్రతిభను ప్రదర్శించే ప్రధాన వేదికగా పనిచేస్తోంది.

**ఐఎఫ్ఎఫ్ఐ గురించి**

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం దక్షిణాసియాలోనే పురాతనమైన, అతిపెద్ద సినిమా వేడుకగా నిలుస్తుంది. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్... భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... గోవా రాష్ట్ర ప్రభుత్వం... గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ప్రపంచ సినిమాకు ప్రధాన కేంద్రంగా ఎదిగింది. ఇక్కడ అలనాటి అపురూప చిత్రాలు, సాహసోపేతమైన ప్రయోగాత్మక చిత్రాలు, లెజెండరీ మాస్ట్రోలు, నిర్భయంగా రూపొందించిన తొలి సినిమాలు ఒకే చోట కలిసి ఈ వేడుకలకు హాజరైన ప్రేక్షకులను అలరిస్తాయి.

ఐఎఫ్ఎఫ్ఐకి దాని విభిన్న కళల సమ్మేళనమే గొప్ప శక్తినిస్తుంది. అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, ఘన నివాళులతోపాటు... ఆలోచనలు, ఒప్పందాలు, సహకారాలకు అపార అవకాశాలను అందించే శక్తిమంతమైన వేవ్స్ ఫిల్మ్ బజార్ వంటి కార్యక్రమాలు ఐఎఫ్ఎఫ్ఐని మరింత అద్భుత వేదికగా మారుస్తున్నాయి. నవంబర్ 2026లో అందమైన గోవా తీరప్రాంతంలో ప్రదర్శితమయ్యే 57వ ఎడిషన్.... భాషలు, రూపాలు, సాంకేతికతలు, సరికొత్త కథన సంప్రదాయాలకు సంబంధించిన వైవిధ్యభరితమైన విస్తృత శ్రేణిని ఒకచోట చేర్చనుంది.

## అమెరికాకు 100 బిలియన్ డాలర్ల నష్టం : ఇరాన్

**మే 1 వుదయం డెస్క్ :**

ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం కారణంగా తమ దేశానికి 25 బిలియన్ డాలర్లు (సుమారు రూ 2.30లక్షల కోట్లు) ఖర్చయినట్లు ఇటీవల అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఖండించారు. యుద్ధం ఖర్చును అమెరికా తక్కువ చేసి చూపిస్తోందన్నారు. ఇప్పటికే అమెరికాకు 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9లక్షల కోట్లు) మేర నష్టం వాటిల్లిందని అన్నారు. "ఖర్చుపై పెంటగాన్ అబద్ధాలు చెబుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కారణంగా అమెరికాకు భారీగా నష్టం వాటిల్లింది. ఈ యుద్ధ ప్రభావం అమెరికా పన్ను చెల్లింపుదారులపై పరోక్షంగా చాలా ఉంది. ప్రతి అమెరికా కుటుంబంపైనా ఆర్థిక భారం పడుతోంది'' అని అరాగ్చీ పేర్కొన్నారు.



## బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించను
### ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు



**మే 1 వుదయం డెస్క్ :**

బహిరంగ కార్యక్రమాల్లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ జాకెట్ ధరిస్తే.. లావుగా కన్పిస్తానని, అందుకే దాన్ని ధరించేందుకు తాను ఇష్టపడనని చెప్పుకొచ్చారు. గతంలో ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ఇటీవల వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కూడా కాల్పులు చోటుచేసుకొన్నాయి. దీంతో ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై చర్చ జరుగుతోంది.

గురువారం ఓవల్ ఆఫీసులో విలేకరుల సమావేశంలో ఓ జర్నలిస్టు దీనిపై ట్రంప్‌ను ప్రశ్నించారు. ఆ జాకెట్ ధరిస్తే 20 పౌండ్లు బరువు పెరిగినట్లు కన్పిస్తానన్నారు. ఇది తనకు అంత ఇష్టం ఉండదని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలకు విలేకరులతో సహా అక్కడున్న కాంగ్రెస్ సభ్యులంతా ఒక్కసారిగా నవ్వులు చిందించారు. 'బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై చాలామంది నన్ను అడిగారు. అది పరిగణించాల్సిన విషయమే. కానీ, నాకు అలా చేయడం ఇష్టం ఉండదు. ఎందుకంటే అలా చేస్తే ఒక చెడు శక్తికి మనం లొంగిపోయినట్లు అవుతుంది' అని ట్రంప్ అన్నారు. ఈ క్రమంలో మరోసారి దాడి జరుగుతుందని ఆందోళన చెందుతున్నారా? అని మరో విలేకరి ప్రశ్నించగా, దాని గురించి తాను ఆలోచించడం లేదని ట్రంప్ బదులిచ్చారు. అలా ఆలోచిస్తే.. తన పనిని తాను సమర్థవంతంగా పూర్తి చేయలేనన్నారు.

## రేపు మీ ఫోన్‌కు అలర్ట్.. ఎందుకంటే..?



**దిల్లీ:** జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం దేశవ్యాప్తంగా సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ వ్యవస్థ పరీక్షను నిర్వహించనున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాజధాని నగరాల్లో ఈ పరీక్ష చేపట్టనున్నారు. సరిహద్దు ప్రాంతాలు, ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో దీనికి మినహాయింపునిచ్చారు. పరీక్ష సమయంలో ప్రజలకు తమ మొబైల్ ఫోన్లలో అత్యవసర అలర్ట్ నోటిఫికేషన్ వస్తుంది. గట్టిగా శబ్దం లేదా వైబ్రేషన్‌తో ఇది రావచ్చు. అలర్ట్ వ్యవస్థ సమర్థతను పరీక్షించేందుకు పంపించే సందేశం ఇదని.. ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదని అధికారులు వివరించారు. అత్యవసర సమయాల్లో కీలక సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడమే దీని ప్రధాన ఉద్దేశం.




## కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్య పరిష్కరించాం

**కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలవాలి**
**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**
**జగిత్యాలలో 'మే' డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల (వుదయం ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ కార్మికులు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అనేక అవస్థలు పడ్డారని కార్మికులు సమ్మె చేస్తే డిస్మిస్ చేస్తానని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకల్లో భాగంగా జగిత్యాల జిల్లాలోని ఆర్టీసీ బస్ డిపోలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొని జెండా ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల సింగరేణి కార్మికుల పోరాట ప్రతిమ మరువలేనిదన్నారు నాడు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వం కనీసం చర్చలకు ఆహ్వానించలేదని మంత్రి అన్నారు ప్రజలు మార్పు కోరుకున్న ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తే కేవలం మూడు రోజుల్లోనే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించామని మంత్రి అన్నారు ముఖ్యమంత్రి ఆదేశాలతో ఐదుగురు మంత్రులు 24 సంఘాల ప్రతినిధులతో చర్చించి సమ్మెకు ముగింపు పలికామని మంత్రి తెలిపారు కార్మికుల న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలవాలని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కార్మిక సోదరులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ జగిత్యాల ఆర్ టి సి కార్మి కుల సంఘం గౌరవ అధ్యక్షులు శంకర్ తోపాటు ఆర్టీసీ కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాల అమలు

**మంచిర్యాల/మే 1, 2026 (వుదయం ప్రతినిధి)**
కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ దుర్గం క్రాంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా మే డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్మికుల దినోత్సవం ప్రతి కార్మికుడు గర్వపడవలసిన రోజు అని, జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రమాద రీత్యా మరణించిన 102 కార్మికుల కుటుంబాలకు సుమారు 60 కోట్ల రూపాయలు, సహజ మరణం పొందిన 223 కార్మికుల కుటుంబాలకు సుమారు 24 కోట్ల రూపాయలు, పెళ్లి ప్రోత్సాహం కింద 993 మందికి సుమారు 30 కోట్ల రూపాయలు, ప్రసూతి ప్రోత్సాహం కింద 1 వేయి 646 మందికి సుమారు 49 కోట్ల రూపాయలు, దివ్యాంగత్వం పొందిన వారికి సుమారు 68 కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని, నైపుణ్యం లేని కార్మికుల నైపుణ్యం పెంపొందించేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థల ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని కార్మికుల భద్రత, హక్కులను కాపాడడం కోసము ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో త్వరలోనే ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతుందని, అసంఘటిత కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి ఇచ్చే నగదును 15 లక్షల రూపాయలకు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సింగరేణిలోని ఒప్పంద కార్మికులకు 5 వేల రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందని, 2 లక్షల 50 వేల రూపాయల లోపు ఆదాయం ఉన్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆహార భద్రత, విద్య ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వ పథకాలు రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం కార్మికులకు, రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.అనంతరం కార్మిక శాఖకు చెందిన బి.సత్యనారాయణ, ఉపాధి కల్పన క్రింద వై. రమేష్ (ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్) , ఉత్తమ ఎస్టాబ్లిష్మెంట్ క్రింద ఓరియంట్ సిమెంట్‌దేవాపూర్, ప్రత్యేక కేటగిరీ (బాల కార్మిక) క్రింద శివాజీ (7 తరగతి విద్యార్థి, జడ్.పి.హెచ్.ఎస్. టేకుల బస్తి, బెల్లంపల్లి) లకు అవార్డులు అందజేశారు. తదనంతరం జిల్లాలోని 16 మండలాలకు ఏం ఎన్ ఆర్ ఇ జి ఎస్ పనుల కోసం పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మంజూరు చేసిన కంప్యూటర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అందజేశారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికులు తమ వృత్తులలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)**

కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం మేడే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ అభివృద్ధికి కార్మికులే ఛోదక శక్తి అని అన్నారు. కార్మికులు అందరూ తమ తమ వృత్తులకు సంబంధించి నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్ల, ఉన్నతి సాధించగలుగుతారని వివరించారు. ప్రతి ఒక్కరూ కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు, ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలు పొందాలని చెప్పారు. నైపుణ్యాలు ఉన్న కార్మికులకు విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. కార్మికులు తదనుగుణంగా ఆలోచన చేసి అవకాశాలు అందిపుచ్చుకోవాలని వివరించారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల్లో నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణలు ఇస్తున్నాయని, కార్మికులు వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ "అచీవ్మెంట్స్, ఆక్టివిటీస్" బుక్ లెట్ ఆవిష్కరించారు. పలువురు కార్మికులకు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం అధికారులు, కార్మికులు కలెక్టర్ కు జ్ఞాపిక అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్మికదినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ (కిషోర్) కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ముత్యం రెడ్డి, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, కోటిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ప్రాధాన్యం

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి**
పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. మే డే సందర్భంగా మున్సిపల్ సొంత నిధులతో కొనుగోలు చేసిన సబ్బులు, నూనె, బెల్లం, చెప్పులు, గ్లౌజులు తదితర సంక్షేమ సామగ్రిని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మున్సిపల్ కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే డే అనేది కార్మికులకు కేవలం సెలవు రోజు మాత్రమే కాదని, వారి సంక్షేమం మరియు ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మున్సిపాలిటీ తరపున ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు కూడా పట్టణ పరిశుభ్రతకు తమ వంతు బాధ్యతగా పనిచేసి ఆదిలాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా నిలబెట్టాలని సూచించారు. మున్సిపల్ నూతన కమిషనర్ జగదీష్ గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## గ్రామీణ విద్యార్థులకు
# సాంకేతిక నైపుణ్యాల పెంపు

**రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు శ్రీధర్ బాబు**
**డిజిటల్ అక్షరాస్యతతో భవిష్యత్తుకు బలమైన పునాది**
**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ**
**మంథని లో నిర్వహిస్తున్న "సూపర్ సమ్మర్" శిబిరాన్ని సందర్శించిన మంత్రి**



**పెద్దపల్లి(మంథని) వుదయం ప్రతినిధి** గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మంథని పట్టణంలో నిర్వహిస్తున్న "సూపర్ సమ్మర్" వేసవి శిబిరాన్నిమంత్రి శ్రీధర్ బాబు సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. టిఫైబర్ సంస్థ, సూపర్ టీచర్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాలలో శిక్షణ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను మంత్రి పరిశీలించారు. కంప్యూటర్ ప్రాథమిక నైపుణ్యాలు, AI భావనలు, రోబోటిక్స్ అనువర్తనాలలో విద్యార్థులు సాధించిన పురోగతిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాలకు సాంకేతిక విద్యను చేరువ చేయడంలో టిఫైబర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో డిజిటల్ అక్షరాస్యత ఎంతో అవసరమని ఆయన అన్నారు. రోబోటిక్స్ విభాగంలో విద్యార్థులు రూపొందించిన మూన్ ల్యాండర్ నమూనాను మంత్రి గారికి వివరించారు. అంతరిక్ష పరిశోధనలో దీనికి ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించగా మంత్రి అభినందించారు. డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం మంథని నుండి సుమారు 70 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటుండగా, పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొత్తం 351 మంది విద్యార్థులు ఈ నెల రోజుల కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలలో వారం రోజుల చొప్పున శిక్షణా తరగతులతో ఈ కార్యక్రమాన్ని దశలవారీగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు, కార్యక్రమ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే..
# ప్రభుత్వం ధ్యేయం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల మే 01 (వుదయం ప్రతినిధి)** కోరుట్ల మండలంలోని గుమ్లాపూర్ ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్ లలో శుక్రవారం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి లతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టింగుల పేరుతో రైతులను మోసం చేసిందని నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతిగా కృషి చేస్తుందన్నారు. కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినపల్లి సత్యనారాయణ రావు ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి ఇబ్రహీంపట్నం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు కోటగిరి వెంకటస్వామి వివిధ గ్రామాల సర్పంచులు జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్ రంజిత్ రెడ్డి డైరెక్టర్ బూస రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# ధర్మపురిలో ఘనంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్

**ధర్మపురి,మే01(వుదయం ప్రతినిధి):** బుద్ధ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ధర్మపురి క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరి త సేన కార్యక్రమంలో భాగంగా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణం లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం డబేరీ నవీన్ రాజు శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఏకబిల్వ మొక్కకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ ఆవరణలో దానిని నాటారు.ఈ సందర్భంగా కమల్ గౌడ్ మాట్లాడుతూ పెరుగు తున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్క లు నాటాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సి జన్ అందించడమే లక్ష్యంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగస్వా ములు కావాలని కోరారు. ఆధ్యా త్మిక చింతనతో పాటు పర్యావరణ స్పృహనుచాటడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా హరిత సేన సభ్యులు మొక్కల సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు గోపి,శ్రీనివాస్,తిరుపతి,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

**నిజామాబాద్, మే 01:**
తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడ లో గల షెడ్యూల్డు కులాల వసతి గృహంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఫౌండేషన్ కోర్సును కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటివరకు 10 బ్యాచ్ లలో 800 మందికి శిక్షణ అందించగా, వారిలో 199 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని ఎస్సీ స్టడీ సర్కిల్ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం 11వ బ్యాచ్ లో 93 మంది ఫౌండేషన్ కోర్సులో చేరారని, వీరికి ఐదు నెలల పాటు ఉచిత భోజన వసతి సదుపాయాలతో నాణ్యమైన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. వారి విద్యాభివృద్ధికి కూడా ఎనలేని ప్రాధాన్యతనిస్తూ, పోటీ పరీక్షలలో ప్రతిభను కనబర్చి ఉద్యోగ అవకాశాలు పొందేలా స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు సమకూరుస్తూ ఉచితంగా శిక్షణ అందిస్తోందని అన్నారు. ఈ అవకాశాన్ని సరైన విధంగా వినియోగించుకుంటే, ఆశించిన విధంగా ప్రభుత్వ కొలువు దక్కించుకోవచ్చని, భవిష్యత్తు ఎంతో బాగుంటుందని హితవు పలికారు. సమయాన్ని వృధా చేయకుండా, గట్టి సంకల్పంతో కృషి చేయాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటూ ఏకాగ్రతతో కష్టపడి చదవాలని కర్తవ్యాన్ని బోధించారు. ఆంగ్లంలో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. వివిధ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల కాకముందు నుండే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని మార్గనిర్దేశం చేశారు. అంతకుముందు కలెక్టర్ వసతి గృహంలోని గదులు, కిచెన్ తదితర వాటిని సందర్శించి భోజన, వసతి సదుపాయాలు పరిశీలించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థుల కోసం పోటీ పరీక్షలకు ఉపయోగపడే అన్ని రకాల బుక్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి రజిత, సహాయ అధికారి రాజ గంగారాం, స్టడీ సర్కిల్ డైరెక్టర్ దేవిదాస్ పాల్గొన్నారు.




# ప్రభుత్వ పథకాలపై కార్మికులకు అవగాహన పెంచాలి

**కరీంనగర్ మే 1(వుదయం ప్రతినిధి)** :సమాజ అభివృద్ధిలో కీలకమైన కార్మికుల ఆరోగ్యం, భద్రతకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ చిత్రా మిశ్రా భరోసానిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన భవన నిర్మాణ రంగ కార్మికులను వెల్ఫేర్ బోర్డు కింద నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, అందించే ఆర్థిక సాయం వారికి తెలిసేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.బాయిలర్స్, ఫ్యాక్టరీ డిపార్ట్మెంట్ అధికారులు తరచుగా పరిశ్రమలను తనిఖీ చేస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నమోదు కాని పరిశ్రమలు గుర్తించి చట్ట పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. వీధి వ్యాపారులు, గ్రిగ్, మున్సిపల్ తదితర విభాగాల్లో పనిచేస్తూ అసంఘటిత కార్మికులుగా నమోదు కాకుండా ఉంటే వెంటనే నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు.కార్మికులకు ఈఎస్ఐ ద్వారా అందుతున్న వైద్య సేవలు వివరిస్తూ.. కార్మికులు యజమాని మధ్య మంచి వాతావరణం ఉండేలా చూడాలన్నారు.1840 ఏళ్ల కార్మికులను పి.ఎం.ఎస్.వై.ఎం కింద నమోదు చేయించాలన్నారు. బాల కార్మికులు లేని జిల్లాగా కరీంనగర్ ను తీర్చిదిద్దాలని వివరించారు.కార్మికుల పిల్లలకు అందించే విద్య, అంగన్వాడి కేంద్రాల సేవలు వివరించాలన్నారు. ఉపాధి కల్పన శాఖ అందించే నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని కార్మికులకు సూచించారు. నైపుణ్యాలు కలిగిన కార్మికులకు టామ్ కామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భద్రతకు పెద్దపీట వేస్తుందన్నారు. ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ద్వారా నైపుణ్యాలు కల్పిస్తూ జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మ్యాన్ హోల్ లో మనుషులకు బదులు యంత్రాలు ఉపయోగించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ కార్మికులకు అన్ని వసతులు కల్పించాలన్నదే లేబర్ డే ఉద్దేశమన్నారు. .డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కలిసికట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు రాష్ట్ర కార్మిక శాఖ రూపొందించిన బ్రోచర్ ఆవిష్కరించారు.అనంతరం బెస్ట్ ఎంప్లాయిమెంట్ అవార్డులు, బెస్ట్ మేనేజ్మెంట్ అవార్డు, స్పెషల్ కేటగిరి పురస్కారాలు అందించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ కోలా ప్రసాద్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ తిరుపతిరావు, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ గంగాధర్ రెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం

## కొబ్బరి నీళ్లు, సబ్జా గింజలు కలిపి తీసుకోవచ్చా..?

# ఆరోగ్యానికి మంచిదేనా..



వేసవిలో

చాలామంది డీహైడ్రేషన్‌కి గురై మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను ఎదుర్కొంటుంటారని అంటున్నారు నిపుణులు. అందుకు కొబ్బరి నీళ్లు, సబ్జా రెండూ సమర్థవంతంగా పని చేస్తాయి. అసలు వేసవిలోనే మూత్రపిండాల్లో రాళ్ల సమస్య ఎందుకు అధికంగా ఉంటుందంటే.. రికార్డు స్థాయిలో నమోదయ్యే అధిక ఉష్ణోగ్రతలు శరీర సాధారణ పనితీరుపై అధిక ఒత్తిడిని కలిగిస్తాయి. దీనిని 'హీట్ స్ట్రెస్' లేదా వడ దెబ్బ అంటారు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి అధికంగా నీరు కోల్పోవడం వల్ల డీహైడ్రేషన్ సంభవించవచ్చు. మూత్రం కూడా చిక్కగా మారుతుంది, దాని రంగును బట్టి శరీరం ఎంత డీహైడ్రేషన్‌కు గురైందో తెలుస్తుంది. అలాంటి టైంలో మన తీసుకునే ఆహారం శరీరానికి వేడిచేసేవి అయితే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ఈ సమయంలో తగినంత నీరు తీసుకోవడంపై చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. అంతేగాదు శరీరంలో ఎలక్ట్రోలైట్లు, ఖనిజాలు, విటమిన్లు సమతుల్యంగా ఉండేలా చేసుకోవడానికి, వివిధ వనరుల ద్వారా నీటిని తీసుకోవడం అత్యంత అవసరం. ప్రకృతి అందించే సహజసిద్ధమైన ఔషధం.. కొబ్బరి నీరు శరీరానికి ఎలక్ట్రోలైట్లు, యు పొటాషియంను అందించే ఒక సహజ జల వనరుగా పేర్కొంటారు. అంతేకాకుండా, దీనికి నిర్విషీకరణ, బాక్టీరియా నిరోధక, పునరుజ్జీవనం, జీర్ణక్రియ, మూత్రవిసర్జన వంటి ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. మూత్రపిండాల నుంచి లవణాలను బయటకు పంపడానికి తగినంత నీరు అందనప్పుడు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి, కాబట్టి ఇది వాటిని నివారించగలదు. తరుచుగా కొబ్బరి నీరు తీసుకోవడం వల్ల మూత్రం పలుచబడు

తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. కొబ్బరి నీరు జీర్ణాశయ సంబంధిత సమస్యలు, రక్త విరేచనాలపై సానుకూల చికిత్సా ప్రభావాలను కలిగి ఉంటుంది. పిల్లలలో పోషకాహార లోపాన్ని పరిష్కరించడంలో కూడా సహాయపడుతుంది. కాబట్టి కొద్ది పరిమాణంలో తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లో రాళ్ల నుంచి మెరుగైన రక్షణ లభిస్తుంది. సబ్జా గింజల్లోని నీటిని శోషించుకునే లక్షణం మూత్రపిండాల్లో రాళ్లను నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఫార్మా ఇన్నోవేషన్ జర్నల్ ప్రకారం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఖనిజాలను కలిగి ఉండే పోషక ప్రొఫైల్, మూత్ర సంబంధిత ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది, మూత్రపిండాల పనితీరుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. కొబ్బరి నీరు, సబ్జా గింజల సరైన కలయిక మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతాయని ఆయుర్వేదం చెబుతోంది. ఇంటర్నేషనల్ బ్రాజ్ జె యూరల్‌లో ప్రచురించిన పరిశోధన ప్రకారం, కొబ్బరి నీళ్ళు తాగడం వల్ల మీ మూత్రంలో ఉప్పు స్ఫటికాలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది కానీ సబ్జా గింజలు మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తాయనేందుకు ఆధారాలు లేవు అని పేర్కొంది. కొబ్బరి నీళ్ళు లేదా తులసి గింజల వంటి సహజసిద్ధమైన హైడ్రేటింగ్ వనరులను సురక్షితంగా తీసుకోవడానికి వ్యక్తిగత వైద్యులు లేదా నిపుణులను సంప్రదించి అనుసరించడం ఉత్తమం అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. మన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమకు అనుగుణంగా సురక్షితమైన విధంగా ఎలా తీసుకోవాలో సూచిస్తారని చెబుతున్నారు. అంతేగాదు లోబీపీతో బాధపడేవారు సబ్జాగింజలకు దూరంగా ఉండటమే మంచిదని చెబుతున్నారు.

## వేసవిలో కూల్ డ్రింక్స్ తాగుతున్నారా బీ అలర్ట్..!!



వేసవి కాలంలో కూల్ డ్రింక్స్ ఎక్కువ మంది తీసుకుంటారు. రానికి వేడి నుండి క్షణంలో ఉపశమనం కలిగిస్తాయని చాలా మంది వీటిని తాగుతూ ఉంటారు. వీటిని తీసుకోవటం ద్వారా తాత్కాలికంగా ఉపశమనం లభించినా.. పలు అనారోగ్య సమస్యలకు కారణం అవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలో ఉండే అధిక చక్కెర, కెఫీన్ వంటి పదార్థాలు అలవాటుగా మారే ప్రమాదం ఉంది. పరిశోధనల ప్రకారం, ఈ పానీయాలను తరచుగా తీసుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. వేసవిలో రెగ్యులర్ గా కూల్ డ్రింక్స్ తో వచ్చే ప్రమాదాల పై నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. కూల్ డ్రింక్స్ లో పోషక విలువలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి కేవలం ఎంప్టీ కాలరీలు మాత్రమే ఇస్తాయి. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలు అందకుండా అదనపు కాలరీలు చేరి మేలు చేయని ఆహార అలవాట్లకు దారితీస్తాయి. సాఫ్ట్ డ్రింక్స్‌లో కెఫీన్ అధికంగా ఉంటుంది. కెఫీన్ అధికంగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె వేగం పెరగడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా రాత్రి సమయంలో వీటిని తీసుకోవడం నిద్ర నాణ్యతను దెబ్బ తీస్తుందని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు. కెఫీన్, చక్కెర మూత్ర విసర్జనను పెంచి శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉంది. ఇక గుండె ఆరోగ్యంపై కూడా వీటి ప్రభావం ఉంటుంది.

## స్కిన్‌కు సన్‌స్ట్రోక్..!

ఎండకు ఎక్స్‌పోజ్ అయినప్పుడు సూర్యుడి రేడియేషన్ ప్రభావాలేమిటి, వాటి వల్ల చర్మంపై పడే రకరకాల ప్రభావాలూ, వాటి కారణంగా వాటిల్లే నష్టాలూ, వాటిని అధిగమించే మార్గాలేమిటో తెలుసుకుందాం... చూపు అనే విజువల్ సెన్స్ కలిగించడానికి ఉపయోగపడేది చాలా తక్కువ. ఇందులో రేడియో తరంగాలూ, ఎక్స్–కిరణాలూ, మైక్రోవేవ్ తరంగాలూ ఇలా రకరకాల రేడియేషన్స్ అనేక వేవ్‌లెంత్స్‌లో ఉంటుంది. దీన్నింతా కలిపి 'ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్' అంటారు. అయితే ఇందులో మనకు దృష్టిజ్ఞానాన్ని ఇచ్చేందుకు అవసరమయ్యే 'కాంతి' చాలా తక్కువ. అయితే మొత్తం ఎల



క్ట్రోమాగ్నెటిక్ రేడియేషన్‌లోని వివిధ రకాల కిరణాలు వేవ్‌లెంత్స్ కలిగి ఉంటాయి. ఒక కిరణం లేదా తరంగంలోని పక్కపక్కనే ఉండే అలలోని... ఒక పీక్‌కూ, మరో పీక్‌కూ మధ్యనున్న దూరాన్ని వేవ్‌లెంత్‌గా చెప్పుకుంటే మన కళ్లకు కనిపించే కాంతి తాలూకు వేవ్‌లెంత్ చాలా పరిమితంగా మాత్రమే ఉంటుంది. ఖచ్చితంగా చెప్పాలంటే 400 – 700 నానో మీటర్ల రేంజ్‌లో ఉండే దాన్ని మాత్రమే మనం కాంతిగా పేర్కొంటాం. అంతకంటే తక్కువ వేవ్‌లెంత్‌తో ఉండే కిరణా

లను అల్ట్రా వయొలెట్ కిరణాలుగానూ, అంతకంటే ఎక్కువ వేవ్‌లెంత్‌తో ఉండేవాటిని ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలుగా చెబుతారు. మనకు చేరే కాంతితోపాటు మన వాతావరణంలోకి వచ్చే ఈ అల్ట్రా వయొలెట్ (యూవీ), ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలతో మన చర్మానికీ, కంటికి కూడా హాని కలిగే ప్రమాదం ఉంది. పైగా వేసవిలో ఈ కిరణాల తీవ్రత మరింత ఎక్కువగా ఉండటం వల్ల అమితమైన శక్తితో ఉండే ఈ కిరణాలు కంటికి హాని చేసే అవకాశాలు ఎక్కువ. సూర్యుడి నుంచి వచ్చే రేడియేషన్‌లోని హానికారకమైన చాలా రకాల రేడియేషన్‌ను మన భూమిపైన ఉండే ఓజోన్ పొర వడపోస్తుంది. మొత్తం రేడియేషన్‌లో కేవలం 3 శాతం అల్ట్రా వయొలెట్ కిరణాలు మాత్రమే భూమి ఉపరితలం వరకు చేరతాయి. ఇలా భూమిని చేరిన ఈ మూడు శాతం అల్ట్రా వయొలెట్ కిరణాల వల్ల చర్మంపై అనేక దుష్ప్రభావాలు కలుగుతాయి. యూవీ–సీ అని పిలిచే ఒక రకం అల్ట్రా వయొలెట్ కిరణాలు చాలా చాలా ప్రమాదకరమైనవి. కొన్నిసార్లు వాటి ప్రభావంతో స్కిన్–క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా ఉంటుంది. అదృష్టవశాత్తు యూవీ–సీ కిరణాలను ఓజోన్ పొర అడ్డుకొని మనతోపాటు సకల జీవరాశినీ కాపాడుతుంటుంది. నిజానికి 400 – 700 న్యానోమీటర్ల మేరకు కాంతిపటలం తప్ప... అంతకు మించిన వేవ్‌లెంత్ వల్ల... అలాగే అంతకంటే తక్కువ వేవ్‌లెంత్ వల్ల... ఇంకా చెప్పాలంటే... అల్ట్రావయొలెట్, ఇన్‌ఫ్రారెడ్ కిరణాలతో మన చర్మానికి ఎంతో ప్రమాదం. అంతటి ప్రమాదకరమైన వేవ్‌లెంట్ ఉన్న తీక్షణమైన రేడియేషన్‌ను మానవ చర్మం తట్టుకోలేదు. సాధారణంగా 308 న్యానోమీటర్ల వేవ్‌లెంట్ వరకు మనం తట్టుకోగలమని ఓ రఫ్ అంచనా. ఒకవేళ రేడియేషన్ తాలూకు వేవ్‌లెంత్ ఫ్రీక్వెన్సీ 308 న్యానోమీటర్లు ఉన్నప్పుడు మనుషుల చర్మం ప్రభావితమవుతుంది. అయితే ఈ రేడియేషన్‌ను తట్టుకునే శక్తి కూడా వేర్వేరు వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు నల్లటి చర్మం (డార్క్ స్కిన్) ఉన్నవారు ఎండ తీవ్రత తీక్షణంగా ఉన్నా తట్టుకోగలరు. కానీ చర్మం తాలూకు రంగులో డార్క్‌నెస్ తగ్గుతున్నకొద్దీ అంటే చర్మం ఫెయిర్‌గా అవుతున్న కొద్దీ ఎండ తీవ్రతను తట్టుకునే శక్తి కూడా తగ్గుతూ పోతుంది. అందుకే తెల్లటి చర్మం (ఫెయిర్ స్కిన్) ఉన్నవారు ఎండ తీవ్రతకు చాలా త్వరగా ప్రభావితమవుతారు. ఎండ తీవ్రత ప్రభావం రెండు రకాలుగా ఉంటుంది. మొదట తీవ్రమైన ఎండకు ఎక్స్‌పోజ్ అయినప్పుడు చర్మం నల్లబారుతుంది. మొదటి దశల్లో ఇది కేవలం తాత్కాలికం. ఎండకు వెళ్లడం తగ్గిస్తే ఇలా నల్లబారడమూ తగ్గుతుంది. ఇలా చర్మం నల్లబారడాన్ని పిగ్మెంటేషన్ అంటారు. చర్మంపై అల్ట్రావయొలెట్ కిరణాల దుష్ప్రభావాలు ఈ కింద పేర్కొన్న రీతిలో ఉంటాయి. సాధారణంగా సూర్యుడి తీక్షణత ప్రభావం వల్ల ఎండలోకి వెళ్లగానే మొదట చర్మం ఎర్రగా మారుతుంది. ఆ తర్వాత మాడినట్లుగా నల్లబడుతుంది. ఇలా జరగడాన్ని సన్‌బర్న్‌గా చెప్పవచ్చు. దీన్నే వైద్యపరిభాషలో ఎరిథిమా అని చెబుతారు.

## భోజనం తర్వాత తీసుకోకపోవడమే మంచిదా..?

పుచ్చకాయ పోషకాలు అధికంగా ఉండే పండు. ఇది తిన్న వెంటనే కడుపు నిండిన అనుభూతిని అందిస్తుంది. అయితే చాలామంది ఈ పుచ్చకాయ తిన్న వెంటనే కడుపు ఉబ్బరంగా ఉందంటూ ఫిర్యాదులు చేస్తుంటారు. ఎందుకిలా అంటే.. సర్వసాధారణంగా ఇలా ఎందుకు జరుగుతుందంటే భారీ భోజనం తర్వాత ఎప్పుడైతే పుచ్చకాయ తింటారో ఆ క్షణమే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అందులోనూ వేసవి ఉష్ణోగ్రతలు కారణంగా పుచ్చకాయ వినియోగం ఆటోమేటిగ్గా పెరుగుతుంది. అందువల్ల ఇలా వేసవిలోనే ఈ సమస్య తీవ్రమవుతుందా? లేక ప్రతిసారి ఇలానే జరుగుతుందా అంటే.. నిజానికి వేసవిలో కడుపు ఉబ్బరం సర్వసాధారణమని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే అధిక వేడి కారణంగా శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించడానికి ఇబ్బంది పడుతుండటంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుందని చెబుతున్నారు. తత్ఫలితంగా ఈ సమస్య వస్తుందని చెబుతున్నారు. కాబట్టి ఈ కాలంలో అధిక నీటి శాతం ఉన్న పండ్లు, తినే భోజనం రెండూ సమతుల్యంగా ఉంటే ఈ సమస్య రాదని అంటున్నారు.



అంతేగాదు మనం పుచ్చకాయలను తీసుకునే విధానం కారణంగానే ఈ కడుపు ఉబ్బరం లేదా గ్యాస్ సమస్య వస్తుందని చెబుతున్నారు. అంతేగాదు అలాంటి సమయంలోనే జీర్ణవ్యవస్థపై పుచ్చకాయ ప్రభావం చూపిస్తుంది. అదీగాక ఈ పుచ్చకాయలో అధికంగా ఫ్రక్టోజ్ ఉండటం వల్ల పెద్దప్రేగుల్లో ఇది పులిసి, గ్యాస్ ఉత్పత్తి అవ్వడానికి దారితీసి కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటివి కలుగుతాయని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అదీగాక మనం తినే భోజనంతో పోలిస్తే పుచ్చకాయ వంటి పండ్లు జీర్ణాశయం గుండా వేగంగా ప్రయాణిస్తాయట. ఎప్పుడైతే ఈ రెండిటిని కలిపి తీసుకుంటామో దాని ఫలితం ఈ పుచ్చకాయ ముక్కలు జీర్ణం కావడాన్ని ఆలస్యం చేస్తుంది, దాంతో పులియబెట్టడం, గ్యాస్ ఏర్పడటం వంటివి జరుగుతాయని అన్నారు.

## చలువ చేసే మారేడు పానకం..!

వేసవి తాపం నుంచి విముక్తినిచ్చే చలవ చేసే పానియమే ఈ మారేడు పానం. దీన్ని ఒడియా ప్రజలు తమ సంవత్సరాది రోజున చేసుకుని తింటారు. అచ్చం మన ఉగాది పచ్చడిలా వాళ్లు ఈ మారేడు పానకాన్ని తయారు చేసుకుంటారు. వాళ్ల సంవత్సరాది వైశాఖ మాసంలో వస్తుంది. వాళ్లకి అప్పుడు వసంతకాలం అన్నమాట. వాళ్లు కూడా మనలా ఈ రోజు నంచే చలివేంద్రాలు ఏర్పాటు చేసి లాంఛనంగా ఈ మారేడు పానం వితరణను ఆనవాయితీగా చేస్తుంటారు. వేసవి ప్రారంభానికి గుర్తుగా ఈ పానకం తయారు చేస్తారు ఒడియా ప్రజలు. ఇదెలా తయారు చేస్తారంటే.. పండిన మారేడు పండును పగలగొట్టి, లోపలి గుజ్జును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఈ గుజ్జులో తగినన్ని నీళ్లు పోసి, చేతితో బాగా పిసికి (లేదా మిక్సీ పట్టి) 15–20 నిమిషాలు నానబెట్టాలి. పిసికిన మిశ్రమాన్ని జల్లెడ ద్వారా వడపోసి, పీచు, గింజలను వేరు చేసి స్వచ్ఛమైన రసాన్ని తీసుకోవాలి.ఈ రసంలో రుచికి సరిపడా బెల్లం తురుము లేదా పంచదార వేసి కరిగే వరకు కలపాలి. చివరగా చిటికెడు యాలకుల పొడి, కావాలంటే కొద్దిగా నిమ్మరసం కలిపి, చల్లటి నీరు లేదా ఐస్ క్యూబ్స్ వేసి సర్వ్ చేసుకోవచ్చు. ఈ చల్లని పానీయం వేసవి వేడి నుంచి శరీరాన్ని చల్లగా ఉంచడమే కాకుండా ఆరోగ్యప్రదం కూడా.



## పెరుగు అన్నం vs లెమన్ రైస్:

### ఈ సమ్మర్‌లో డయాబెటిస్ రోగులకు ఏది మంచిది..



మరి ఈ రెండు వంటకాల లోని పోషక విలువలు వేరువేరుగా పరిశీలించి ఏది తీసుకోవడం మంచిదో పోషకాహార నిపుణులు మాటల్లో తెలుసుకుందామా..!. రైస్ రక్తంలో చక్కెరను ఎందుకు పెంచుతుందంటే..శుద్ధి చేసిన తెల్ల బియ్యం రకాన్ని బట్టి దాని గ్లైసెమిక్ ఇండెక్స్ 58గా ఉంటుందని తెలుస్తోంది. ఒకేసారి ఎక్కువగా అన్నం తింటే రక్తంలో చక్కెర వేగంగా పెరుగుతుంది, కాబట్టి వైద్యులు డయాబెటిస్ పేషెంట్లను అన్నం తీసుకునే పరిమాణాన్ని నియంత్రించుకోవాలని సూచిస్తుంటారు. పెరుగు, అన్నంతో పాటు రకరకాల మసాలాలు, కరివేపాకు కలిపి తయారు చేస్తారు. ఇది రుచిని జోడించడమే కాకుండా, రక్తంలో చక్కెరను పెంచే ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది. వేడి తీవ్రంగా ఉన్నందున మధ్యాహ్న భోజనానికి ఇది చాలా అనువైనది. శరీరానికి చల్లదనాన్ని అందిస్తూ..రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉండేలా చూసుకునే పోషకమైన ఆహారం. దీని తయారీలో సాదా అన్నాన్ని పెరుగుతో కలుపుతారు. దీనిలో ప్రయోజనకరమైన ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇది కార్బోహైడ్రేట్ల శోషణ రేటును నెమ్మదింపజేస్తుంది. అన్నంలో పెరుగు కలపడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వంపై దాని ప్రభావం నెమ్మదిగా ఉంటుంది. ఇది మెదడుని ప్రశాంతంగా ఉంచడమే కాకుండా జీర్ణక్రియను మెరుగ్గా ఉంచుతుంది. దీనిలో ప్రోటీన్, మెరుగైన కొవ్వులు ఉంటాయి. ఇవి రక్తంలోని చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. వేసవి వేడికి చక్కటి ఉపశమనం కూడా. అలాగే గ్లూకోజ్ ప్రతిస్పందనను స్థిరీకరిస్తుంది కూడా. రక్తంలో చక్కెర నియంత్రణ కోసం ఇది బెస్ట్ ఆహారం. ఇది కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను కూడా నెమ్మదింపజేస్తుంది, అందువల్ల ఇది ఇతర వేసవి ఆహారాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయంగా ఉంటుంది. దీని తయారీకి ఉపయోగించే నూనె, వేరుశెనగలు మరియు ఆవాలు కలపడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణ మరింత మెరుగుపడుతుంది. పెరుగు అన్నం సాధారణంగా భోజనం తర్వాత గ్లూకోజ్ పెరుగుదలను నెమ్మదింపజేస్తుంది, కాబట్టి దానిని ఎలా తీసుకుంటే మంచిదనే దానిపై అవగాహన అవసరం. నియంత్రించుకోవడం అవసరం. నిమ్మకాయ అన్నం ఇందులో ఉపయోగించే నూనె పరిమాణంపై ఆధారపడి ఉంటుంది, అలాగే తినే పరిమాణం కూడా అత్యంత ముఖ్యం. రోజులోని సమయం, శారీరక శ్రమ స్థాయి, వ్యక్తిగతంగా గ్లూకోజ్ తట్టుకునే సామర్థ్యం వంటి అంశాలు రక్తంలో చక్కెరను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఆ రెండింటిని తీసుకునే పరిమాణం అనేది అత్యంత ప్రధానం అని చెబుతున్నారు పోషకాహార నిపుణులు.

## చిన్నారులకు ఆ చిరుతిండ్లు వద్దు..!

ఎదుగుదలకు హానికరం

చిన్నారుల ఎదుగుదలపై ఈ జంక్ ఫుడ్స్ తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా ఎక్కువ క్యాలరీలు, చక్కెర, ఉప్పు ప్రభావంతో వారిలో రోగ నిరోధక శక్తి నశించి అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయి. వీటిలో ఎటువంటి ప్రోటీన్లు, విటమిన్లు ఉండవు. దీనివల్ల పెరుగుదల, రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. బర్గర్లు, పిజ్జా, చిప్స్, సోడాల్లో పోషకాలు తక్కువ, క్యాలరీలు ఎక్కువ ఉంటాయి. దీంతో శరీరం పోషక లోపంతో ఎదుగుతుంది. అధిక బరువు, గుండె, లివర్ సమస్యలకు దారి తీస్తాయి. ఎక్కువ చక్కెర, ఫ్యాట్స్ వలన స్థూలకాయం, మధుమేహపు ప్రమాదం, ఫాటీ లివర్ మొదలైన సమస్యలు చిన్న వయసులోనే వచ్చే ప్రమాదం ఉంది. అలాగే ఏకాగ్రత తగ్గి, చిరాకు, అలసట, నిద్రలేమి సమస్యలు వస్తాయి.

చిన్నారులకు జంక్ ఫుడ్‌ను మాన్పించే విషయంలో తల్లిదండ్రుల నుంచి మార్పు రావాలి. ఇంట్లో తల్లిదండ్రుల ఆహార అలవాట్లుకు అనుగుణంగా పిల్లల ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే విషయంలో ఆకర్షణీయంగా ఇంట్లోనే పదార్థాలను తయారు చేసి వారికి అందివ్వాలి. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో ఆహారాన్ని తయారు చేయడంలో పిల్లలు భాగస్వామ్యం ఉండే విధంగా చూడాలి. దీనివలన వారు తయారు చేసిన ఆహారాన్ని ఎలాగైనా తినాలి అనే మార్పు వస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినే విషయంలో వారిని ప్రోత్సహించే విధంగా చిన్నపాటి ప్రోత్సాహకాలు అందజేయాలి. దీనివలన ఆరోగ్యకరమైన ఆహారంపై ఆసక్తి పెరుగుతుంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్ ఆహారం అనారోగ్యం అనే విషయంపై చిన్నారులకు అవగాహన కల్పించాలి.



## మచ్చలేని అందం కోసం..

రెనెక్సోసోమ్ కాంప్లెక్స్, మేకపాలు, మొండో గ్రాస్ పదార్థాలు ఈ మాస్క్‌కి ప్రత్యేకం. రెనెక్సోసోమ్ కాంప్లెక్స్ రెటినాల్ కంటే నాలుగు రెట్లు వేగంగా కొలాజెన్‌ను ఉత్పత్తి చేసి, చర్మంపై ముడతలను తగ్గిస్తుంది. మేకపాలలో ఉండే విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రీబయోటిక్స్‌చర్మం పీహెచ్ స్థాయిని సమతుల్యం చేసి, దెబ్బతిన్న చర్మాన్ని కేవలం 20 నిమిషాల్లోనే రిపేర్ చేస్తాయి. మొండో గ్రాస్ చర్మానికి అవసరమైన తేమను అందించి, రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈ మాస్క్ ముఖానికి వేసుకున్నప్పుడు చల్లటి అనుభూతిని ఇస్తుంది. మంచు నీటిలో ముఖాన్ని ఉంచినట్లుగా చల్ల బరుస్తూ, రక్తనాళాలను కుంచించుకుపోయేలా చేస్తుంది. దీనివల్ల చర్మంపై ఉండే ఎరుపుదనం తగ్గి ఉపశమనం కలుగుతుంది. చర్మంపై దీర్ఘకాలిక వాపును కూడా ఇది సమర్థంగా అడ్డుకుంటుంది. ఈ మిల్క్ ఆర్‌ఎక్స్ కంప్రెస్ డిజైన్ కూడా భిన్నంగా ఉంటుంది. ఇందులో ప్రత్యేకమైన చిన్ స్ట్రాప్ ఉంటుంది. ఇది గడ్డం కింద చర్మాన్ని పట్టి ఉంచి, ముఖానికి తీరైన ఆకారాన్ని ఇస్తుంది. ఈ మాస్క్‌ను వారానికి ఒకసారి వాడటం వల్ల కొలాజెన్ స్థాయి గణనీయంగా పెరిగి, చర్మం యవ్వనంగా, కాంతి మంతంగా మారుతుంది ప్రాచీన రోమన్ ప్రజలు రొట్టెల పిండిని



ఫేస్‌ప్యాక్‌గా ఉపయోగించేవారు. రొట్టెల పిండిని ముఖానికి పట్టించుకోవడం వల్ల ముఖం ముడతలు పడకుండా ఉంటుందని నమ్మేవారు. క్రీస్తుశకం ఒకటో శతాబ్దికి చెందిన రోమన్ చక్రవర్తి ఓథో ప్రతిరోజూ స్నానానికి ముందు గడ్డం మీసం నున్నగా గీసేసుకుని, ముఖానికి రొట్టెల పిండి పట్టించుకునేవాడట!

తాజా మెంతి ఆకులను మెత్తగా రుబ్బి రాత్రి పడుకునే ముందు ముఖానికి పట్టించి ఉదయం కడగాలి. మెంతి ఆకులను వాడేటప్పుడు వాటిని ముందుగా శుభ్రం చేయాలి. వాటి మీద చల్లిన క్రిమిసంహారక మందుల అవశేషాలు లేకుండా శుభ్రం చేసిన తర్వాత మాత్రమే గ్రైండ్ చేయాలి. ఈ ప్యాక్ క్రమం తప్పకుండా మూడు వారాల పాటు వేస్తే మొటిమలు, బ్లాక్‌హెడ్స్, వైట్ హెడ్స్ తొలగి చర్మం నునుపుగా మారుతుంది.

## సమ్మర్‌లో హైడ్రేషన్ కోసం..!



దాహం వేసిందనో మరే కారణంగానో ఒకేసారి ఎక్కువ నీరు తీసుకోకూడదని చెబుతున్నారు నిపుణులు. దీనివల్ల ఎక్కువ పరిమాణాంలోని నీరు కణాలకు సమర్థవంతంగా అందుకుండానే బయటకు వెళ్లిపోతుందట. అరలీటరు నీరు తాగితే నాడీ వ్యవస్థ కార్యచరణ మెరుగ్గా ఉంటుందట. అంతకుమించి తాగితే శరీరంలోని కణాలకు తేమ అందకుండా పోతుందని అధ్యయనాల్లో వెల్లడైందని చెబుతున్నారు. శరీరానికి తేమను అందించడానికి కేవలం నీరు మాత్రమే కాకుండా ఆహారం కూడా తోడ్పడుతుంది. పుచ్చకాయ, దోసకాయ, నిమ్మజాతి పండ్ల వంటివి ద్రవాల శరీరానికి అవసరమైన ఖనిజాలను అందిస్తాయి. ఇవి వేడి వాతావరణంలో తేమను నిలుపుకోవడానికి, శక్తి స్థాయిలను కాపాడుకోవడానికి సహాయపడతాయి అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. చాలామంది ఎంత ఎండకాలం అయినా.. కాఫీ, టీలు పడాల్సిందే లేదంటే కష్టం. వేసవిలో ఇవి శరీరానికి తగినంత నీరు సమర్థవంతంగా అందకుండా చేస్తుందట. అలాగే కూల్‌డ్రింక్‌లు, ఇతర పానీయాలు శరీరానికి నీరు అందుతుందన్న భావనను కలిగిస్తాయి గానీ ఇవన్నీ డీహైడ్రేషన్‌ను మరింత తీవ్రతరం చేస్తాయని అంటున్నారు.

హైడ్రేషన్ అవసరాలు స్థిరంగా ఉండవని అంటున్నారు. శారీరక శ్రమ, వయస్సు, మొత్తం ఆరోగ్యం ఆధారంగా మారుతూ ఉంటాయి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా, ముఖ్యంగా ఎయిర్ కండిషన్డ్ వాతావరణంలో శరీరం ద్రవాలను కోల్పోతూనే ఉంటుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. మన యూరిన్ రంగు ఆధారంగా మన శరీరం హైడ్రేటెడ్‌గా ఉందా లేదా అని తెలుసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అదెలా అంటే..మూత్రం రంగు మరి చిక్కగా పసుపు రంగులో ఉంటే వేడి అధికంగా ఉందని, తక్కువ పసుపు రంగులో ఉంటే..తగినంతగా నీరు తీసుకోవాలని..అలా కాకుండా నీళ్లలా ప్యూర్‌గా ఉంటే..శరీర హైడ్రేటెడ్‌గా ఉందని అర్థమట.

నీరు తాడం మాత్రమే చూస్తాం. ఎంత వ్యవధిలో తాగుతున్నాం అనేది ముఖ్యం. చాలా సమయం అయ్యాక తగితే..అంత ప్రభావవంతగా ఉండదు. పైగా దీని కారణంగా బయటకు వెళ్లిన వెంటనే వడదెబ్బ బారిన పడతామని అంటున్నారు. అలాగే భోజనంలో బాగా ఆయిల్‌తో చేసే పదార్థాలకు దూరంగా ఉండాలంటున్నారు. తేలికపాటి కాలనుగుణ భోజనమే మేలని చెబుతున్నారు.

తీవ్రమైన ఎండ నుంచి వచ్చిన వెంటనే చల్లటినీళ్లు అస్సలు తాగకూడదల. ఇది జీర్ణక్రియకు ఆటంకం కలిగించి, శరీర ద్రవాలు సమర్థవంతంగా శోషించబడటాన్ని నెమ్మదింపచేస్తుందట. అందుకుని నీళ్లు లేదా కొబ్బరి నీళ్లను తాగే ముందు ఎండకు గురైన శరీరం తగిన ఉష్ణోగ్రతకు స్థిరపడే వరకు ఆగి తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

## వాణిజ్య సిలిండర్‌పై రూ.993 పెంపు



వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. ఒక్క సిలిండర్ (19 కేజీలు)పై సగటున రూ.993 పెంచుతున్నట్లు చమురు సంస్థలు పేర్కొన్నాయి. నేటి నుంచి ఈ పెంపు అమల్లోకి వచ్చింది. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదని కేంద్రం వెల్లడించింది. రెండు నెలలు గడుస్తున్నా అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయాలు ఈ పెంపునకు దోహదం చేశాయి. ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభంకాగా.. అప్పటి నుంచి వాణిజ్య సిలిండర్ ధరను మూడుసార్లు పెంచినట్లయింది. మార్చిలో రూ.144, ఏప్రిల్ ఒకటిన రూ.195, ఇప్పుడు అమాంతం రూ.993 పెరిగింది. దీంతో ఒక్క సిలిండర్ ధర రూ.3వేలు దాటింది.




# చమురు మంటలు.. ఎయిరిండియా కీలక నిర్ణయం

ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి (Iran War). ఈ ప్రభావం విమానయాన సంస్థల పైనా పడుతోంది. ఈ క్రమంలో రోజువారీగా 100 సర్వీసుల్ని తగ్గించుకోవాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధరలు భారీగా పెరగడంతో కొన్ని మార్గాలకు విమానాలను నడపడం ఆర్థికంగా లాభదాయకం కాదని సంస్థ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిరిండియా (Air India) రోజుకు సగటున 1100 సర్వీసుల్ని నడుపుతోంది. ఇప్పుడు ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి సుదూర అంతర్జాతీయ మార్గాల్లోని సర్వీసులకే ప్రధానంగా కోత పెట్టనుంది. ఈ మార్గాల్లో ఇంధన వినియోగం ఎక్కువగా ఉండటమే అందుకు కారణం. దిల్లీ, ముంబయి నగరాలకు లండన్, పారిస్, న్యూయార్క్, టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో, సిడ్నీ, మెల్‌బోర్న్ నుంచి రాకపోకలు సాగించే విమానాల సంఖ్య ఇకనుంచి తగ్గనుందని తెలుస్తోంది. ఇరాన్ యుద్ధం వేళ.. వరుసగా రెండో నెల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు పెరిగాయి. అంతర్జాతీయ విమాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచుతూ చమురు సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. తాజా ప్రకటనతో దిల్లీలో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర ఐదు శాతం పెరిగి.. 1,511.86 డాలర్లకు చేరింది. ప్రపంచవ్యాప్తంగా జెట్ ఇంజిన్ ధరలు భారీగా పెరగడంతో నిర్వహణ వ్యయాలు భారంగా




మారతాయని విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇటీవల కొన్ని వారాల్లోనే ఏటీఎఫ్ ధరలు దాదాపు 80 శాతం పెరిగాయి. దీంతో విమాన సంస్థల నిర్వహణ వ్యయంలో 40 శాతం ఏటీఎఫ్‌కే వెచ్చించాల్సి వస్తోందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా చమురు కంపెనీలు అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ప్రతినెలా ఒకటో తేదీన ఏటీఎఫ్ ధరలను సవరిస్తాయి. ఈసారి దేశీయ విమాన సంస్థలకు మాత్రం మినహాయింపు లభించింది. ఇప్పటికే కేంద్రం వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెంచింది. ప్రస్తుతానికి గృహావసరాలకు వినియోగించే సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం ముట్టుకోలేదు కానీ తాజా పరిణామాలు మాత్రం దేశ ప్రజలకు భారంగా మారతాయనే చెప్పాలి.

# ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు
## రూ.2.43 లక్షల కోట్లు




దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఏప్రిల్ నెలకు గానూ 8.7 శాతం వృద్ధితో రూ.2.43 లక్షల కోట్ల మేర వసూళ్లు అయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈ స్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. 2025 ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు వసూలయ్యాయి. గత నెల కూడా జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ.. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల కావడమూ ఈ వసూళ్లకు ఓ కారణంగా కనిపిస్తోంది. 2025 ఏప్రిల్ నెలలో కూడా ఇదే ఊపు కనిపించింది. ఇక రిఫండ్ల సర్దుబాటు అనంతరం ఏప్రిల్ నెలకు నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 4.3 శాతం వృద్ధితో రూ.1.85లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 25.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి.


# మస్క్ వేతన ప్యాకేజీ రూ.15 లక్షల కోట్లు..!




: అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వేతన అంశం మరోసారి వార్తల్లో నిలిచింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయనకు ఏకంగా 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ఈమేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. అయితే, ఈ మొత్తం మస్క్ (Elon Musk) ఖాతాలో పడదండోయ్..! ఇందుకు కొన్ని షరతులుంటాయి. సాధారణంగా టెస్లా (Tesla) సీఈఓగా ఎలాన్ మస్క్ నెలవారీ జీతంగా ఎలాంటి మొత్తాన్ని పొందరు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ మస్క్‌కు 158 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.15 లక్షల కోట్లు) ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. అయితే, ప్రకటనలో ఉన్న మొత్తంతో పోలిస్తే.. వాస్తవంగా ఆయన పొందే విలువలో గణనీయమైన వ్యత్యాసం ఉండొచ్చని కంపెనీ తమ ఫైలింగ్‌లో వెల్లడించింది. తాజాగా ప్రకటించిన దానిలో.. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా పేర్కొన్నారు. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలన్నీ నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. ఇక, ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు.. టెస్లా బోర్డు ఆమోదించిన మధ్యంతర అవార్డు రూపంలో లభిస్తుంది. గతేడాది కూడా మస్క్‌కు టెస్లా కంపెనీ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించిన సంగతి తెలిసిందే. అది పూర్తిగా ఈక్విటీ అవార్డు గ్రాంట్ల రూపంలో ఇవ్వనున్నట్లు నాడు తెలిపింది. అంటే.. టెస్లా స్టాక్ విలువ పెరిగి, నిర్వహణ పరంగా కంపెనీ నిర్దేశించుకున్న మైలురాళ్లను చేరుకుంటే ఆ మొత్తం మస్క్‌కు లభిస్తుందన్నమాట. అయితే, గతేడాది టెస్లా మార్కెట్ విలువ పెరగలేదు. నిర్దేశించుకున్న లక్ష్యాలను కూడా అందుకోకపోవడంతో.. మస్క్‌కు ఎలాంటి పారితోషికం లభించలేదు.

# విదేశీ మదుపర్లు అమ్మేస్తున్నారు..

దిల్లీ: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను పెద్ద మొత్తంలో తరలిస్తున్నారు. ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.60,847 కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ సంస్థాగత మదుపర్లు (FPI) విక్రయించినట్లు ఎన్ఎస్‌డీఎల్ డేటా చెబుతోంది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1.92 లక్షల కోట్ల విలువైన సొమ్మును ఉపసంహరించినట్లు పేర్కొంది. 2025 మొత్తం క్యాలెండర్ సంవత్సరంలో ఉపసంహరించిన రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ. ఒక్క ఫిబ్రవరి నెల మినహా 2026 క్యాలెండర్ సంవత్సరం ప్రారంభం నుంచి విదేశీ మదుపర్లు విక్రయాలుకొనసాగిస్తున్నారు. జనవరిలో రూ.35,962 కోట్ల ఈక్విటీలను విక్రయించిన ఎఫ్‌పీఐలు.. ఫిబ్రవరిలో మాత్రం రూ.22,615 కోట్ల నిధులను మన మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. మళ్లీ మార్చి నెలలో రికార్డు స్థాయిలో రూ.1.17 లక్షల కోట్లు, ఏప్రిల్ నెలలో రూ.60,847 కోట్లు ఉపసంహరించినట్లు డేటా చెబుతోంది. భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ స్థూల ఆర్థిక అనిశ్చితులు ఎఫ్‌పీఐల విక్రయానికి కారణమని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణ వాతావరణంతో క్రూడాయిల్ ధరలు అమాంతం పెరిగాయని, దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొనడం కూడా ఓ కారణమని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా ప్రిన్సిపల్ మేనేజర్ హిమాన్షు శ్రీవాస్తవ పేర్కొన్నారు. సమీప భవిష్యత్‌లో రేట్లలో కోత ఉండకపోవడం, బాండ్ రాబడులు అధిక స్థాయిలో ఉండడం భారత్ సహా వర్ధమానమార్కెట్లపై ఎఫ్‌పీఐలఅనాసక్తికి కారణమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా డబ్ల్యూటీఐ క్రూడ్ బ్యారెల్ 90 డాలర్ల దిగువకు చేరితే ఎఫ్‌పీఐ ఇన్‌ఫ్లోలు పెరిగే అవకాశం ఉందని ఏంజిల్ వన్‌లో సీనియర్ అనలిస్ట్ వకార్ జావేద్ ఖాన్ అంచనా వేశారు. ఈ ఏడాదిలో రూ.1.7 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను దేశీయ సంస్థాగత మదుపరులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.






## మహిళల బాత్రూంలో చిత్రీకరణ ఆరోపణలు..

శ్రీలంకకు చెందిన ఇద్దరు అండర్-19 క్రికెటర్లను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన కొలంబోలో చోటుచేసుకుంది. హోటల్ బాత్రూంలో మహిళలను అసభ్యంగా తమ ఫోన్లలో చిత్రీకరించారనే ఆరోపణలతో వారిని అదుపులోకి తీసుకొన్నారు. వారిద్దరిని అలుత్‌కాడే మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు హాజరుపరిచారు. ఈవాదనలు విన్న న్యాయమూర్తి విచారణను మే25కి వాయిదా వేశారు. ఒక్కొక్కరికి 5 లక్షల శ్రీలంక రూపాయల వ్యక్తిగత పూచీకత్తు మీద బెయిల్‌ను మంజూరుచేయడంతో వారు విడుదలయ్యారు. దీనిపై శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత వారం తాము ఉంటోన్న హోటల్‌లో మొబైల్ ఫోన్లను ఉపయోగించి ఈ ఇద్దరు యువ క్రికెటర్లు చిత్రాలు, వీడియోలు తీసినట్లు పోలీసులకు మహిళల నుంచి ఫిర్యాదులు అందాయి. తాము బాత్రూంలో ఉన్నప్పుడు చిత్రీకరించారంటూ బాధిత మహిళలు పేర్కొన్నారు. దీనిపై నారహెన్‌పిటా పోలీసులు విచారించగా.. సదరు ప్లేయర్లు ఈ వీడియోలను ఆన్‌లైన్‌లో షేర్ చేసినట్లు గుర్తించారు. శ్రీలంక క్రికెట్ పాత పరివర్తన కమిటీ తొలగించి కొత్తపాలకమండలి వచ్చిన 48 గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది.

## వైభవ్ సూర్యవంశీ దూకుడు..
# స్టార్క్‌ను ఎలైట్ క్లబ్‌లో చేర్పిస్తాడా?

పదిహేనేళ్ల పెను సంచలనం వైభవ్ సూర్యవంశీ ఓ ఎలైట్ క్లబ్‌ను క్రియేట్ చేశాడు. అందులో కేవలం స్టార్ బౌలర్లకే చోటు ఇస్తానంటూ తన బ్యాట్‌తో బదులు ఇవ్వడం గమనార్హం. ఇంతకీ ఆ ఎలైట్ క్లబ్ ఏంటా? అని మీ డౌట్ కదా.. అదేనండీ.. యువ బ్యాటర్ వైభవ్ స్టార్ పేసర్ల బౌలింగ్‌లో తాను ఎదుర్కొనే తొలి బంతినే సిక్స్‌గా మలిచిన క్లబ్. ఇప్పటికే దాంట్లో జోష్ హేజిల్‌వుడ్, జస్‌ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్ చేరిపోయారు. మరి ఆ జాబితాలోకి మరో స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ వస్తాడా? లేకపోతే తాను ఆ క్లబ్ మెంబర్ కాదని నిరూపించుకుంటాడో చూడాలి మరి. ఎందుకంటే జైపుర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో దిల్లీ క్యాపిటల్స్ తలపడేందుకు సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్‌లో స్టార్క్ ఆడతాడని తెలుస్తోంది. అయితే, ఆ ముగ్గురిలా స్టార్క్ తొలి బంతినే సిక్స్ ఇవ్వడని విండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్ అంచనా వేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై వైభవ్ సెంచరీ సాధించినప్పటికీ రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. మొన్నటివరకూ అజేయంగా కొనసాగుతున్న పంజాబ్ కింగ్స్‌కు, రాజస్థాన్ తొలి షాక్ ఇచ్చింది. భారీ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. ఇక్కడా వైభవ్ సూర్యవంశీ దూకుడుగానే ఆడాడు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో రాజస్థాన్ ప్లేఆఫ్స్‌తోపాటు టాప్-2లో ఉండాలంటే ఈ మ్యాచ్ గెలుపు అత్యంత కీలకం. మరోవైపు దిల్లీ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎనిమిది మ్యాచుల్లో కేవలం మూడే విజయాలతో ఉన్న డీసీ.. ఒక్కటి ఓడినా ప్లేఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతాయి. 264 పరుగుల భారీ టార్గెట్ ఇచ్చినా పంజాబ్ చేతిలో దిల్లీకి ఓటమి తప్పలేదు. ఇక గత మ్యాచ్‌లో ఆర్సీబీపై కేవలం 75 పరుగులకే కుప్పకూలి విమర్శలపాలైంది. ఈ-సిగరెట్ తాగుతూ సోషల్ మీడియాలో సంచలనంగా మారిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ ఈ మ్యాచ్ సమయంలో ఎలా ప్రవర్తిస్తాడనేది చర్చనీయాంశంగా మారింది. తొలి తప్పిదంగా 25 శాతం జరిమానాతో బయటపడినప్పటికీ నెట్టింట మాత్రం రియాన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. అతడికి తక్కువ శిక్ష విధించారంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇటు బ్యాటర్‌గానూ విఫలమైన రియాన్.. వాటన్నింటి నుంచి బయటపడాలంటే మాత్రం మంచి ఇన్నింగ్స్ ఆడాల్సిందే.




# హార్దిక్ పాండ్య కెప్టెన్సీ అర్థం కావడంలేదు: సెహ్వాగ్

భారీ లక్ష్యం కాపాడుకోలేక సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ముంబయి ఇండియన్స్ ఘోర ఓటమిని చవిచూసింది. పిచ్ నుంచి బౌలర్లకు సహకారం లభించడం లేదని భావించినా.. కెప్టెన్‌గా హార్దిక్ తీసుకున్న నిర్ణయాలు మాజీ క్రికెటర్లు వీరేంద్ర సెహ్వాగ్, మురళీ కార్తిక్‌ను ఆశ్చర్యానికి గురి చేశాయి. మరీ ముఖ్యంగా ఇంపాక్ట్ ప్లేయర్ రూపంలో శార్దూల్ ఠాకూర్‌ను తీసుకొచ్చినా అతనికి బౌలింగ్ ఇవ్వకపోవడంపై కార్తిక్ స్పందించాడు. దానికి సెహ్వాగ్ కూడా స్పందించాడు.''నాకు ఇప్పటికీ అర్థంకాని విషయం ఏంటంటే.. శార్దూల్‌ను వారు ఓ ఆప్షన్‌గా తీసుకొచ్చారు. కానీ, అతడిని మరిచిపోయారో? లేదా ఏదైనా జరిగిందో అర్థం కాలేదు. నన్ను బాగా శోధించండి.. నా ముఖంలోనూ అలాంటి భావమే ఉంది'' అని మురళీ కార్తిక్ తెలిపాడు. దానికి సరదాగా స్పందించిన సెహ్వాగ్.. ''నాకు ఆ రెడ్‌బుల్ క్యాన్ ఇవ్వు. కార్తిక్ మీద స్ప్రే చేశాక వెతుకుతా'' అని వ్యాఖ్యానించాడు. ''మీరు ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటర్ లేదా బౌలర్‌ను తీసుకొన్నందుకైనా అతన్ని వినియోగించుకోవాలి. శార్దూల్‌కు కనీసం ఒక్క ఓవర్ అయినా ఇస్తే బాగుండేది. అతడు వికెట్ టేకింగ్ బౌలర్. కనీసం అతడిని ప్రయత్నిద్దామని కూడా మీకు అనిపించలేదు. ఆ నిర్ణయం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎందుకు ఇవ్వలేదో మీరే హార్దిక్‌ను అడగాలి'' అని సెహ్వాగ్ అన్నాడు. ప్రస్తుతం ముంబయి ఇండియన్స్ 8 మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించింది. పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది.





# పరాగ్‌కు జరిమానా

దిల్లీ: రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై ఐపీఎల్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ (వేపింగ్) తాగుతూ కెమెరాలకు చిక్కిన పరాగ్‌పై జరిమానా విధించింది. క్రికెట్‌కు మచ్చ తెచ్చేలా ప్రవర్తించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ రిఫరీ అమిత్‌శర్మ నిర్ణయం తీసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే ఫీల్డ్ అంపైర్లు తన్మయ్ శ్రీవాస్తవ, నితిన్ మేనన్ ఈ విషయాన్ని రిఫరీకి నివేదించలేదు. అయితే ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దీన్ని ఐపీఎల్ ప్రవర్తన నియమావళిలోని లెవెల్-1 ఉల్లంఘనగా అమిత్ నిర్ధారించాడు. పరాగ్ తన తప్పును అంగీకరించడంతో విచారణ అవసరం లేకుండానే జరిమానా ఖరారైంది. కేవలం ఆటగాడిపైనే కాకుండా రాజస్థాన్ జట్టుపై కూడా బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉంది. ''ఐపీఎల్ ప్రతిష్ఠను కాపాడేందుకు సదరు జట్టు, అధికారులు, ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఉన్న మార్గాలను బీసీసీఐ అన్వేషిస్తోంది'' అని ఐపీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ''ఆ ప్రకటనలో స్పష్టంగా చెప్పినట్లుగానే రాజస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాన్ని మేం పరిశీలిస్తున్నాం. దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు'' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపాడు.




# బంతి నేలను తాకినట్లు అనిపించింది: క్యాచ్ ఔట్ వివాదంపై ఆర్సీబీ

అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓటమిని చవిచూసింది. అయితే, ఆ జట్టు బ్యాటర్ ఔటైన తీరు ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. కెప్టెన్ రజత్ పాటీదార్ భారీ షాట్ కొట్టగా.. బౌండరీ లైన్ వద్ద జాసన్ హోల్డర్ అద్భుతంగా క్యాచ్ పట్టాడు. అయితే, బంతి నేలను తాకిందని కోహ్లి సహా ఆర్సీబీ ప్లేయర్లు అంపైర్లతో వాదించారు. కానీ, థర్డ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. దీనిపై మ్యాచ్ అనంతరం బెంగళూరు బౌలర్ భువనేశ్వర్ కుమార్ స్పందించాడు. తమ స్టాండ్‌కు ఇప్పటికీ కట్టుబడి ఉన్నట్లు వెల్లడించాడు. థర్డ్ అంపైర్ మరికొన్ని కోణాల్లో నిశితంగా పరిశీలించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు. 'ఆ సమయంలో నేను అక్కడ లేను. కానీ, ఆ తర్వాత చూసినదానిని బట్టి బంతి నేలను తాకినట్లు అనిపించింది. అంపైర్ ఆ సమయంలో ఏం చెప్పారో తెలియదు. ఆట నియమాలకు లోబడి ఉందో, లేదో చెప్పలేను. వాటిపై నాకు పెద్దగా అవగాహన లేదు. అయితే, దీనిని మరింత నిశితంగా గమనించి ఉంటే బాగుండేది'' అని భువి వెల్లడించాడు.'ఈ మ్యాచ్‌లో మా బ్యాటర్లు సరిగా ఆడలేదనడం కంటే మాకు కలిసి రాలేదని చెప్పొచ్చు. ఒక్కో రోజు అలాగే ఉంటుంది మరి. మేం టాస్ ఓడిపోయాం. తొలుత బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. విజయం కోసం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు శ్రమించాయి. కానీ, ఫలితం మాకు అనుకూలంగా రాలేదు. సుదీర్ఘమైన టోర్నీలో 14 లీగ్ మ్యాచులు ఆడతాం. ప్రతిసారీ అన్ని విభాగాల్లో మంచి ప్రదర్శన చేయాలంటే కష్టమే. అందుకు ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తాయి'' అని భువనేశ్వర్ తెలిపాడు.



# వుదయం సినిమా

## బాలకృష్ణ- కొరటాల కాంబో ఫిక్స్



**వుదయం సినిమా:** టాలీవుడ్‌లో మరో క్రేజీ మాస్ కాంబో ఫిక్స్ అయింది. బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో సినిమా రానున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. నేడు ఈ ప్రాజెక్ట్‌ను (NBK 112) అధికారికంగా ప్రకటించారు. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. "అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది" అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. దర్శకుడు ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశారని త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని టీమ్ తెలిపింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'ఇందులో బాలయ్యకు జోడీగా నయనతార నటిస్తున్నట్లు సమాచారం.

## క్యాస్ట్ విషయంలో జాఫర్ గెటప్ శ్రీను వాగ్వాదం!



**వుదయం సినిమా :** ప్రముఖ నటుడు గెటప్ శ్రీను తాజాగా జర్నలిస్ట్ జాఫర్‌కు ఇచ్చిన వ్యక్తిగత ఇంటర్వ్యూలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మహదేవపట్నంలో జరిగిన ఈ ఇంటర్వ్యూ ప్రారంభంలో సరదాగా సాగిన సంభాషణ, కొద్ది సేపటికే ఉద్రిక్తతకు దారితీసింది. ఇంటర్వ్యూలో భాగంగా జాఫర్ అడిగిన ఒక ప్రశ్నకు గెటప్ శ్రీను సమాధానం ఇచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయినట్లు సమాచారం. శ్రీను మాట్లాడుతూ "మేము కాపులం" అంటూ ఏదో సందర్భంలో స్పందించగా, ఆ వ్యాఖ్యపై జాఫర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అలా మాట్లాడకూడదు" అంటూ జాఫర్ స్పందించడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసినట్లు సమాచారం.

## పెద్ది అద్భుతంగా వచ్చింది

### డైరెక్టర్ సుకుమార్





**వుదయం సినిమా :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' షూటింగ్ మొత్తం పూర్తయింది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. చిత్ర బృందం ఇప్పుడు ఒక ముఖ్యమైన అప్‌డేట్‌తో అభిమానులను సర్ప్రైజ్ చేసింది. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. జూన్ ప్రారంభంలో రిలీజ్ కావడం వల్ల సమ్మర్ హాలిడేస్ చివరి దశలో థియేటర్స్ లో ప్రేక్షక ఆదరణ అందుకోవడానికి ఇది పర్ఫెక్ట్ టైం. అకడమిక్ సీజన్ మొదలయ్యే ముందు దేశ వ్యాప్తంగా మంచి ఫుట్‌ఫాల్స్ వస్తాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

హైదరాబాద్‌లోని ఒక భారీ సెట్‌లో ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఒక అద్భుతమైన స్పెషల్ సాంగ్ చిత్రీకరణను చిత్ర బృందం పూర్తి చేయడంతో అధికారికంగా ప్రొడక్షన్ వర్క్స్ పూర్తయ్యాయి. ఈ ఎనర్జిటిక్ సాంగ్ 'పెద్ది' చిత్రంలోని మెయిన్ హైలెట్స్ లో ఒకటిగా నిలవనుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సైమల్టేనియస్‌గా వేగంగా సాగుతున్నాయి.

ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, అనుభవజ్ఞులైన నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఒకేసారి ముగ్గురు స్టార్స్ గుడ్ న్యూస్‌లు



**వుదయం సినిమా :** తెలుగు ఇండస్ట్రీలో ప్రస్తుతం కొత్త సినిమాల హడావుడితోపాటు పెళ్లిళ్ల సీజన్ కూడా నడుస్తోంది. హీరో బెల్లంకొండ శ్రీనివాస్ రెండు రోజుల క్రితమే తిరుమలలో పెళ్లి చేసుకున్నాడు. అంతకు రెండు నెలల ముందు హీరోయిన్ రష్మిక కూడా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. ఇదలా ఉండగానే టాలీవుడ్‌కి చెందిన పలువురు ప్రముఖ నటీనటులు శుభవార్తలు చెప్పేశారు. స్వతహాగా మలయాళీ అయినప్పటికీ తెలుగులో సామజవరగమన, మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ తదితర సినిమాల్లో నటించిన హీరోయిన్ రెబా మోనికా జాన్, తన ప్రెగ్నెన్సీ విషయాన్ని బయట పెట్టింది. థాయ్‌లాండ్‌లోని బీచ్‌లో భర్తతో దిగిన ఫొటోలని షేర్ చేసింది. త్వరలో తాము ముగ్గురు కాబోతున్నామని చెప్పింది. దీంతో ఈమెకు విషెస్ తెలియజేస్తున్నారు.

గతేడాది అక్టోబరులో పెళ్లి చేసుకున్న హీరో నారా రోహిత్ త్వరలో తండ్రి కాబోతున్నాడు. ఇతడి భార్య, నటి శిరీష ప్రస్తుతం ప్రెగ్నెన్సీతో ఉంది. రీసెంట్‌గా సీమంతం వేడుక జరగ్గా అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అధికారికంగా ఈ విషయాన్ని అయితే ఈ జంట బయటపెట్టలేదు. 'ప్రతినిధి 2' మూవీ చేస్తున్న టైంలో ప్రేమలో పడ్డ రోహిత్-శిరీష.. పెద్దల అంగీకారంతో పెళ్లిచేసుకున్నారు. ఇప్పుడు తల్లిదండ్రులు కాబోతున్నారు.

'పుష్ప' సినిమాలో జాలిరెడ్డిగా నటించిన కన్నడ ధనంజయ భార్య ధన్యత కూడా ప్రస్తుతం ప్రెగ్నెన్సీతో ఉంది. ఈ విషయాన్ని తాజాగానే ఈ జంట ప్రకటించారు. తమ ప్రపంచం పెరగనుందని చెబుతూ ఫొటోలని పంచుకున్నారు. కన్నడలో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న ఇతడు.. తెలుగులో 'పుష్ప' కాకుండా ఒకటి రెండు డబ్బింగ్ చిత్రాలతో వచ్చాడు గానీ వర్కౌట్ కాలేదు.

## సాంప్రదాయ వేషధారణలో మృణాల్ ఠాకూర్



**వుదయం సినిమా :** కెరీర్ ప్రారంభంలో సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు సంపాదించిన మృణాల్ ఠాకూర్, ఆ తర్వాత షాహిద్ కపూర్ హీరోగా నటించిన జెర్సీ సినిమాలో హీరోయిన్‌గా నటించి మరింత క్రేజ్ తెచ్చుకుంది. ఆ చిత్రంలో తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె, తరువాత తెలుగులోకి ఎంట్రీ ఇచ్చి సీత రామం, హాయ్ నాన్న, ది ఫ్యామిలీ స్టార్, డెకాయిట్ వంటి చిత్రాల్లో నటించి మంచి ఫాలోయింగ్ సంపాదించింది. ఇప్పటివరకు అనేక సినిమాల్లో నటించిన మృణాల్ కొన్ని చిత్రాల్లో తన గ్లామర్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే సోషల్ మీడియాలో కూడా తరచూ తన అందమైన ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తుంది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ట్రెడిషనల్ లుక్‌లో కొన్ని ఫోటోలు పోస్ట్ చేసింది. అందులో రెడ్ అండ్ యెల్లో కాంబినేషన్‌లో ఉన్న చీర కట్టుకుని, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో డీసెంట్‌గా స్టిల్స్ ఇచ్చింది. మెడలో భారీ హారం, చెవులకు పెద్ద ఇయర్ రింగ్స్, చేతులకు గాజులు, వేళ్లకు ఉంగరాలు ధరించి సంప్రదాయ సోయగాన్ని మరింతగా హైలైట్ చేసింది.

కురులు కవర్ చేసుకుని, నుదిటిపై చిన్న బొట్టు పెట్టుకుని మరింత అందంగా మెరిసింది. మొత్తానికి ట్రెడిషనల్ లుక్‌లో మృణాల్ ఠాకూర్ ఎంతో అందంగా కనిపించడంతో ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ప్రభాస్ క్రేజ్‌కు హద్దుల్లేవు డార్లింగ్ రీరిలీజ్ సెన్సేషన్!



**వుదయం సినిమా :**


టాలీవుడ్ అగ్రహీరో ప్రభాస్ నటించిన డార్లింగ్ రీరిలీజ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. 2010లో విడుదలైన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం, 16 ఏళ్ల తర్వాత 2026 ఏప్రిల్ 23న 4K వెర్షన్‌లో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.10.44 కోట్ల గ్రాస్ వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. తొలి రోజే సుమారు రూ.7.59 కోట్లు వసూలు చేసి, తెలుగులో రీరిలీజ్ సినిమాల్లో రెండో అతిపెద్ద ఓపెనింగ్ సాధించింది. ఈ చిత్రానికి ఎ. కరుణాకరన్ దర్శకత్వం వహించగా, కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. థియేటర్ల వద్ద అభిమానులు కటౌట్లు, బాణాసంచాతో భారీగా సంబరాలు జరుపుకుంటున్నారు. 'డార్లింగ్' క్రేజ్ ఇప్పటికీ తగ్గలేదని ఈ వసూళ్లు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

## ఆయన మైక్ కిందపడేసి వెళ్లిపోయాడు : ప్రియాంక



**వుదయం సినిమా :** 'కెరీర్ ప్రారంభంలో డ్యాన్స్ విషయంలో చాలా ఇబ్బంది పడ్డా. నటన పరంగా ఓకే కానీ.. డ్యాన్స్ వచ్చేది కాదు. కొరియోగ్రాఫర్ చెప్పిన మూమెంట్స్ మరిచిపోయేదాన్ని. నా పక్కన ఉన్న కోస్టార్ ఆ స్టెప్పులు అద్భుతంగా చేసేవారు. నేనేమో వారికి సరిపోయేలా స్టెప్పులు వేయలేక ఇబ్బంది పడేదాన్ని. ఓసారి దక్షిణాఫ్రికాలో ఓ పాట షూటింగ్ జరుగుతున్నప్పుడు కొరియోగ్రాఫర్ రాజు ఖాన్ నాపై సీరియస్ అయ్యాడు. నువ్వు అందాల పోటీ నుంచి వచ్చిండొచ్చు, అందంగా ఉండొచ్చు.. కానీ నటి కావాలంటే ముందు డ్యాన్స్ నేర్చుకో అంటూ మైక్ కిందపడేసి సెట్ నుంచి వెళ్లిపోయాడు. అది నాకు చాలా అవమానంగా అనిపించింది. దీన్ని సవాలుగా తీసుకొని డ్యాన్స్ నేర్చుకున్నా. అప్పట్లో ప్రతి రోజు దాదాపు ఆరు గంటల పాటు కత్రినా కైఫ్‌తో కలిసి ప్రాక్టీస్ చేశా' అని ప్రియాంక చెప్పుకొచ్చింది.

## భగవంతుడు శరణమన్న శరణం సాంగ్



**వుదయం సినిమా:** యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా "భగవంతుడు". ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ రవి పనస. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'శరణమన్న శరణం' సాంగ్ రిలీజ్ చేశారు.

శ్రామిక శక్తికి నమస్కరిస్తూ 'శరణమన్న శరణం' పాటను రూపొందించారు. ఈ పాటకు హాయ్ కే.పి స్ఫూర్తికరంగా కంపోజ్ చేయగా, సింగర్ కుమార వాగ్దేవి పాటలోని భావోద్వేగాలను పలికిస్తూ పాడారు. ఈ పాట గురించి "భగవంతుడు" మేకర్స్ స్పందిస్తూ మన మట్టిలో ప్రతి పని ఒక అమ్మ దేవత సాక్షిగానే మొదలవుతుంది. పొలం గట్టున నాగలి సాగేముందు 'పోలేరమ్మ'ను, చెరువు కట్టపై అలుగులు పోసేటప్పుడు 'గంగమ్మ'ను, కష్ట, సుఖాల్లో 'ఎల్లమ్మ'ను స్మరించుకోవడం మన శ్రామిక సంస్కృతిలో భాగం. ఈ అమ్మ దేవతలు శ్రామికుల చెమట చుక్కల్లో తోడుండే ధైర్య రూపాలు. మన సంస్కృతిలో అమ్మ దేవతల శరణుజొచ్చంది ఏ పనీ మొదలు కాదు. పూర్తి కాదు. అమ్మలకు, సబ్బండ వర్గాలకు ఘనమైన ట్రిబ్యూటే మా ఈ "శరణమన్న శరణం". ఇది నాగలి పట్టిన రైతు, సుత్తి పట్టిన కమ్మరి, చక్రం తిప్పిన కుమ్మరి... ఇలా సకల సబ్బండ కులాల శ్రమజీవుల గుండె చప్పుడు. రక్తాన్ని చెమటగా మార్చి, ఉత్పత్తి చేసే మట్టి చేతులకు, మట్టి చేతులు మోసే పనిముట్లకు నివాళి ఈ గీతం. ఇది ఈ దేశపు సబ్బండ కులాల పతాక గీతం. శ్రమను, తల్లిని ప్రేమించే, పూజించే వారి బతుకు గీతం. మట్టి మనుషులకి వారిని కంటికి రెప్పలా కాపాడే అమ్మ దేవతలకీ మే డే సందర్భంగా మా వందనం. అంటూ కార్మిక లోకానికి సెల్యూట్ చేశారు.



## సాయి పల్లవికి బంపర్ ఆఫర్

**వుదయం సినిమా :** నేచురల్ బ్యూటీ సాయి పల్లవి తన నటనతో అన్ని ఇండస్ట్రీల హీరోలను, దర్శకనిర్మాతలను మంత్రముగ్ధులను చేస్తోంది. దీంతో అమ్మడుకి వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తోంది. తన సహజమైన అందంతో అందరినీ కట్టిపడేసే ఈ భామ, ఇప్పుడు హిందీ చిత్రసీమలో వరుస అవకాశాలను అందుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా ఆమెకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాయి పల్లవి 'ఏక్ దిన్' అనే సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన ఆమె నటించింది. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే సాయి పల్లవి నటనను చూసి ఆమిర్ ఖాన్ షాక్ అయ్యారట. ఆమె పర్ఫార్మెన్స్ ఎంత బాగుందంటే, ఏకంగా తన తదుపరి మూవీలో ఒక పవర్‌ఫుల్ పాత్రను ఆఫర్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి.




## మే 6న ఓటీటీలోకి లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

**వుదయం సినిమా :** డ్యూడ్, డ్రాగన్ చిత్రాలతో టాలీవుడ్‌లోనూ క్రేజ్ తెచ్చుకున్న హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన హీరోగా ఇటీవలే రిలీజైన మూవీ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎల్‌ఐకే). ఈ మూవీకి నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 10న థియేటర్లలో రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది.

తాజాగా ఈ మూవీ ఓటీటీకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా రిలీజైన నెల రోజుల్లోపే ఓటీటీలో సందడి చేయనుంది. దీనిపై అధికారిక ప్రకటన వచ్చేసింది. మే 6వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. కాగా.. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా.. ఉప్పెన ఫేమ్ కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.